# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ : (0863) 2293280, 2293564, 2293206

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 30 Issue 3

No.of Pages 48

NOVEMBER 2010

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O., బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థసద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


ఈ సంచికలో....


| | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| సంపాదకీయం | 4 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీఅభిభాషణ | 8 |
| సన్నిధిలోసంభాషణ | 11 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 14 |
| శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు: | |
| అమ్మ అనురాగం-1 | 16 |
| గాయత్రీ మంత్రం- 2 | 18 |
| ఆవేదన | 19 |
| సంత్‌నామదేవ్ చరితామృతం | 20 |
| శ్రీకృష్ణతత్వము, ప్రేమయోగము | 23 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 25 |
| మౌనధ్యాన సప్తాహ శిబిరం | 27 |
| మాతాజీ బోధామృతం | 29 |
| ఆశ్వయుజ పూర్ణిమ | 31 |
| శుభాభినందన | 34 |
| శ్రీబాబూజీ దివ్యవాణి | 37 |
| సమర్థసద్గురు నాధుని దివ్యచరిత్ర | 39 |
| అమెరికాలో శ్రీ మాతాజీ | 42 |
| మనసాధన ఎందుకు ఫలించటంలేదు? | 44 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 46 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**తం హ కుమారం సంతం దక్షిణాసునీయ మానాసు**
**శ్రద్ధా ఆవివేశ సో అమన్యత**

(కఠోపనిషత్తు)

తత్త్వజిజ్ఞాస గల శిష్య లక్షణం శ్రద్ధ. నచికేతుడు అటువంటి శ్రద్ధగల శిష్యుడు. కావున యమధర్మరాజుకు శిష్యుడై సాధించవలసిన దానిని సాధించ గలిగాడు. తండ్రి తనకున్నదంతా దానం చేయటం గమనించిన నచికేతుడు, "అన్నీ దానం చేస్తున్నావు కదా! నన్నెవరికి దానం చేస్తావు" అని మూడుసార్లు రెట్టించి అడిగేసరికి విసుగుచెంది "నిన్ను మృత్యుదేవతకిస్తాను" అని అనటం వలన యమదర్శనం పొంది ఆత్మతత్త్వాన్ని తెలుసుకోగలిగాడు.

సద్గురుమూర్తిని ఆశ్రయించి ఆవేదన చెందే సాధకునికి శ్రద్ధ సద్గురు మూర్తి ప్రసాదిస్తారు. శ్రద్ధ అనుగ్రహింపబడేది కాని పొందేది మాత్రం కాదు. శ్రీదేవీ సప్తశతీలో "దేవీ శ్రద్ధా స్వరూపిణీ" అని చెప్పబడింది. ఆవిడ దయ కలిగి అనుగ్రహిస్తే మన అదృష్టం. కనుక శ్రద్ధ దైవశక్తి. అన్ని తలుపులూ బంధించుకొని సూర్యకాంతి ఇంట్లోకి రాలేదంటే ఎలా వస్తుంది?

ఆశ్రయించి కవాటాలు తెరచుకున్న సాధకుని సొత్తు శ్రద్ధ. అది ఆత్మదర్శనా శక్తి. మానవుడు దానితోనే దివ్యత్వాన్ని పొందుతున్నాడు. లోకజ్ఞానానికి ఇంద్రియాలు ఎలా సాధనాలో దివ్యదర్శనానికి ఆత్మలబ్ధికి అది సాధనం. విశ్వాసమే శ్రద్ధ. మనస్సు బుద్ధితో తాదాత్మ్యం చెందితేనే శ్రద్ధ ఉదయిస్తుంది. గురువాక్యమునందు అత్యంత భక్తి విశ్వాసం కలిగి ఉండుటయే శ్రద్ధ. సమాధి షట్కసంపత్తిలో శ్రద్ధ అత్యంత విలువైనది. గురువాజ్ఞాపాలనలో శ్రద్ధ కలిగి ఉన్నప్పుడు పొందే అనుభూతినే సమాధానం అని చెప్పబడింది. సద్గురుమూర్తి యందు పరిపూర్ణ విశ్వాసమే శ్రద్ధ. *

# అమ్మ ఆశీస్సులు

శ్రీగురుదేవుల పరమానుగ్రహంతో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు శుభప్రదంగా ముగిశాయి. అన్ని ప్రదేశాలనుండి భక్తులు వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొని జగన్మాత అనుగ్రహాన్ని పొందారు.

కార్తీక పౌర్ణమి( నవంబర్ ది.21న) తర్వాత వచ్చేదే శ్రీ గురుదేవుల 22వ వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు. ఇవి నవంబర్ 24 నుండి డిసెంబర్1 వరకు జరుగుతాయి.అఖండ భగవన్నామ సంకీర్తన,జప, ధ్యాన కార్యక్రమాలలో భక్తులు పాల్గొని తరించటానికి ఇది ఒక మహదవకాశం.

అన్ని భక్తులలోకి సర్వోత్తమమైనది గురుభక్తి. తరించటానికి ఒక్క గురుభక్తి ఉంటే చాలు.

**స్వదేశికస్యైవ చ నామకీర్తనం భవేదనన్తస్య శివస్య కీర్తనమ్ ।**
**స్వదేశికస్యైవ చ నామచిన్తనం భవేదనన్తస్య శివస్య చిన్తనమ్ ॥**

\- గురుగీత

మనం శ్రద్ధతో చేసే గురుస్మరణ, ధ్యాన సంకీర్తనలు సాక్షాత్ శివునికే చెందుతాయి. అనంతుడైన శివుడు భోలా శంకరుడు. చరాచరాలను తరింపచేస్తాడు. సద్గురువు సదాశివస్వరూపుడు. సద్గురు పాదసేవ మనని తరింపచేస్తుంది. తరించటానికి శాస్త్రజ్ఞానం, శ్రుతులు, స్మృతులతో పనిలేదు. భక్తితో చేసే సేవలకు భగవంతుడు ప్రసన్నుడయి అనుగ్రహిస్తాడు. మోక్షాన్ని ప్రసాదిస్తాడు.

**ఏ వేదంబు పఠించె లూత, భుజగంబే శాస్త్రముల్చూచె దా**
**నే విద్యాభ్యసనంబొనర్చె కరి, చెంచే మంత్రమూహించె బో**
**ధావిర్భావ విధానముల్ చదువులయ్యా! కావు! మీ పాద సం**
**సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళ హస్తీశ్వరా।**

సాలెపురుగు శివునికి గూడు కడితే, పాము ఆ గూటిని తీసివేసి మణులతో శివుని అలంకరించేది. వాటిని రాళ్ళుగా భావించిన ఏనుగ వాటిని తీసి పారవేసి, తొండంతో నీళ్ళు తెచ్చి అభిషేకించి ఆకులలములతో పూజించేది. బోయవాడు పుక్కిటితో నదీజలలాను తెచ్చి శివునకు భిషేకించి మాంస కబళాన్ని నివేదనగా అర్పించేవాడు. అనన్యభక్తితో చేసిన వారి సేవలకు మెచ్చి శివుడు మోక్షాన్ని ప్రసాదించలేదా!

త్రేతాయుగంలో వానరులు వారధి కడుతుంటే ఉడత అందించిన సేవలకు మెచ్చి శ్రీరాముడు దానిని ప్రేమతో నిమిరి అనుగ్రహించలేదా! కాబట్టి చదువులు ముఖ్యం కాదు. అనన్యమైన భక్తి ముఖ్యం. అట్టి అనన్యమైన భక్తిని శ్రీ సద్గురుదేవులు ప్రసాదించెదరు గాక సుఖీభవ!!

\- మీ అమ్మ

# సంపాదకీయం

శ్రీసద్గురు దేవుల పరమానుగ్రహంతో పూజ్య యోగిని శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీవారి అనుగ్రహ పర్యవేక్షణలో శరన్నవరాత్ర మహోత్సవాలు ఎంతో వైభవోపేతంగా శ్రద్ధా భక్తులతో భక్తులందరి సహాయసహకారాలతో నిర్వహింపబడ్డాయి. భక్తులంతా మనస్సులో అన్యవిషయాల గురించి ఆలోచించే అవసరంగాని, అవకాశం గాని లేకుండా కార్యక్రమాలు రూపొందించారు.

భగవానుడి పరమానుగ్రహంతో పూజ్యమాతాజీవారి దివ్య బోధామృతాన్ని అందుకుంటూ సద్గురుదేవుల సేవలో పాల్గొనే సదవకాశం ఇంకా పుష్కలంగా పొందే తరుణము లభించనున్నది.

ఈ నెల 21వతేదీన కార్తీక పౌర్ణమి. గురుపూర్ణిమ నాడు శ్రీసద్గురు పాదపూజ, సత్సంగ సమావేశము, శ్రీఉమారామలింగేశ్వరుల నగర పర్యటనోత్సవము శ్రీమాతాజీ చాతుర్మాస్యదీక్షా విరమణ ఉంటాయి.

నవంబర్ 24 బుధవారం నుండి డిసెంబర్ 1వ తేదీ బుధవారం వరకు శ్రీగురుదేవుల ద్వావింశతి పుణ్యారాధన మహోత్సవాలు శ్రీకాళీవనాశ్రమంలో పూజ్య యోగిని శ్రీచంద్రకాళీప్రసాద మాతాజీవారి అనుగ్రహ పర్యవేక్షణలో సాప్తాహిక దీక్షతో పంచయజ్ఞవిధి పూర్వకంగా నిర్వహింపబడతాయి. 1వ తేదీ దీక్షావిరమణ అనంతరం పెదనింద్రకొలను శాఖలో సత్సంగము, భక్తసమారాధన, తెప్పోత్సవము జరుగుతాయి. భక్తులందరూ అన్ని కార్యక్రమాలలో పాల్గొని శ్రీసద్గురుదేవుల కృపకు పాత్రులు కావలసినదిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

-పరాశర ప్రసాద్

గౌరవ సంపాదకుడు

# బాబూజీ ఉవాచ

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్



ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. ఈ మహాభాగ్యం గొల్ల వెంకన్న పొందగలిగింది ఆ మంత్ర శక్తి వల్లనా, లేక అతని నిర్మలభక్తి శక్తి వల్లనా? మంత్రశక్తి వలన అనటానికి వీల్లేదు. ఎందుకని అంటే అది శాస్త్రాల్లో చెప్పబడిన మంత్రం కాదు గదా! కాని మంత్రం అంటే "మననాత్ త్రాయతే యితి మంత్రః" అని; అంటే దేనిని తైల ధారవలె నిర్విరామంగా మనస్సులో నిలిపి జపిస్తే తరింప చేస్తుందో, అదే మంత్రము. "రామ" అని పలకటం కూడా చేతగాని కరకుబోయ, "మరా, మరా" అని జపించి, రామ దర్శనం పొంది, ఆది కవి అయిన వాల్మీకిగా మారలేదా? అది కేవలం భక్తి శక్తి. ఆ భక్తి శక్తి వలన ఏ అక్షరాలు ఎలా పలికినా, పలకలేకపోయినా, అక్షర స్వరూపుడైన పరమాత్ముని దర్శనం పొందవచ్చు. అన్ని అక్షరాలకు, శబ్దాలకు అధిష్ఠానమై, అతీతుడైన పరమాత్మను, అక్షరాలతో అందుకోలేము. అకుంఠిత భక్తికి మాత్రమే ఆయన అందుతాడు. అటువంటి భక్తుడు తాను తరించటమే గాక తనను ఆశ్రయించిన వారిని కూడా తరింపచేస్తాడు.

మన గొల్ల వెంకన్న అలాగే చేశాడు. కొన్నాళ్ళ తరువాత తిరిగి వస్తున్న ఆ పండితుడికి, గురుభావంతో ప్రణామం చేసి, తన అనుభవాన్ని చెప్పాడు. పండితుడు నమ్మలేక పోయాడు. కాని, అమాయకుడైన వెంకన్న అబద్ధమాడడని, నిజానిజాలు తెలుసుకుందామని అక్కడే ఉండిపోయాడు. మరునాడు పండితుడు చెట్టు చాటున దాగి ఉండి విషయమంతా గమనించాడు. తనకు నారాయణుడు గాని గరుడపక్షిగాని, కనిపించలేదు గాని, ఏదో ఒక పెద్ద పక్షి వచ్చి వెళ్ళిన శబ్దాలు, వెంకన్న ఎవరితోనో మాట్లాడుతున్న మాటలు, ఖాళీ అయిన పాయసం గిన్నె, వెంకన్న మాటలను ఋజువు చేశాయి. తన సంస్కార హీనతకు, వెంకన్నకు తాను చేసిన మోసానికి పశ్చాత్తాపం కలిగినా, పండితునిలోని అహంకారం యింకా చావలేదు. అందుచేత, తన మోసాన్ని కప్పి పుచ్చుకుంటూ, "వెంకన్నా, నువ్వు చాలా అదృష్టవంతుడవోయి! నేనిచ్చిన

మంత్రాన్ని చక్కగా సాధన చేసి స్వామిదర్శనం పొందావు. అవును గాని, స్వామితో ఏదో మాట్లాడావు. ఏమిటి?'' అని అడిగాడు. "రేపు నన్ను వైకుంఠం తీసికొని వెళ్ళిపోతానన్నారు స్వామివారు, ఇదంతా మీ దయే గురువుగారూ!'' అని దణ్ణం పెడుతూ అన్నాడు వెంకన్న. తనంతట తానుగా వైకుంఠవాసం పొందే యోగ్యత లేదు గనుక, పుణ్యాత్ముడైన యీ శిష్యుని ద్వారా ఆ ఛాన్సు కొట్టెయ్యాలని ప్లాను వేశాడు పండితుడు. "వెంకన్నా! రేపు స్వామితో పాటు నీవు కూడా గరుత్మంతునిపై కూర్చొని వైకుంఠానికి బయల్దేరే సమయానికి, నేను నీ కాళ్ళు పట్టేసుకుంటాను. నేను నీ గురువునని వైకుంఠనాధుడికి చెప్పి, నన్ను కూడా నీతోపాటు వైకుంఠానికి తీసుకుని వెళ్ళేందుకు ఒప్పించాలి. ఇదే నీవు నాకు యిచ్చే గురుదక్షిణ'' అన్నాడు.

అమాయకుడైన వెంకన్న అంగీకరించి, మర్నాడు స్వామితో తాను గరుత్మంతునిపై వెడుతున్న సమయంలో, తన కాళ్ళు పట్టుకొని వ్రేలాడుతున్న పండితుని గురించి, స్వామితో అలాగే వేడుకున్నాడు. స్వామి ఆ పండితుని నిజ స్వభావం బయటపెట్టి, అతడు మోసగాడని, కృతఘ్నుడని చెప్పినా, ఆయన యిచ్చిన మంత్రం వల్లనే తనకి భాగ్యం కలిగింది గనుక ఆయనే తన గురుదేవుడని, తనతో పాటు ఆయనను కూడా అనుగ్రహించమని, గురుపాద సన్నిధిని మించిన వైకుంఠ పదవి లేదని ప్రార్థించాడు. నిజానికి, ఎప్పుడైతే పండితుడు వెంకన్న పాదాలను పట్టుకున్నాడో, ఆ దివ్య స్పర్శ వలన అతనిలోని అహంకార మమకారాలు రెండూ వెంకన్న ద్వారా స్వామిలో ప్రవేశించి, భక్తి వైరాగ్యాలుగా మారిపోయాయి. పశ్చాత్తాపాగ్నిలో కుమిలిపోతున్న ఆ పండితుని యెడల స్వామి ప్రసన్నుడై, వెంకన్న కోరికను మన్నించాడు. ఆ విధంగా వెంకన్న తన నిర్మల, నిశ్చల భక్తి శక్తితో తాను తరించటమే గాక, ఆ పండితుని కూడా తరింపజేయ గలిగాడు.

వెంకన్నకు లభించిన అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యములు మీకందరికీ ప్రసాదించి, వైకుంఠనాధుడు సర్వదా మిమ్ము కాపాడు గాక

## 10-10-1978 మంగళవారము

కాలం తన గర్భంలో, అప్పుడే యీ నవరాత్రులలో ఏడు రోజులను విలీనం చేసేసుకుంది. ఇవాళ ఎనిమిదవ రోజు. ఏడు రోజులూ ఏడు నిమిషాలలాగా గడిచిపోయినాయి. ఇన్నాళ్ళూ జనని తీర్థ ప్రసాదములు సేవిస్తూ, అమ్మ మధుర నామ సంకీర్తన చేసుకుంటూ ఉంటే, కృపామయి అయిన

జగన్మాత మనకు పరమశాంతిని ప్రసాదిస్తూ, విషయ తాపముల నుండి మనస్సుకు చల్లదనాన్ని, ఊరటను కలిగిస్తూ హాయినిస్తున్నది. ఆ దయను మనం ఎంతని అర్థం చేసుకోగలం? ఏ గణితానికి ఆ దయ అందుతుంది? అది అనుభవైకవేద్యమే గాని మాటలకు, అంచనాలకు అందేది కాదు.

సకల ప్రాణి కోటికి తల్లి అయిన శ్రీ కాళీమాత భయంకర స్వరూపిణి అని, ఆమెను ఆరాధిస్తే విరుచుకు తింటుందని, పొరపాట్లు చేస్తే ఎంతో అపకారం చేస్తుందని తెలియని వాళ్ళు అనుకుంటారు. అది పొరపాటు, ఏ కన్నతల్లి అయినా తన బిడ్డలను విరుచుకు తింటుందా? తన పిల్లవాడు ఎంత అనాకారి అయినా, అవగుణాలు ఉన్నవాడైనా, ఏ తల్లీ అతనిని ద్వేషింపదు. అమ్మ ప్రేమ అమృతం కంటే తియ్యనిది. కాకిపిల్ల కాకికి ముద్దు. అందుకే కన్నతల్లి ప్రేమకు సాటిలేదంటారు. అమ్మ చల్లని ఒడిలో పడుకుంటే బిడ్డ పొందే ఆనందము, పెంచటానికి నియమించిన దాది ఒడిలో పడుకుంటే వస్తుందా? అవ్యాజ కరుణామూర్తి, అభయదాత అయిన అమ్మ మనకు ఎన్నడూ అపకారం చెయ్యదు.

ఇక జ్ఞానపరంగా తెలుసుకుంటే, అమ్మ కేవలము అనంత శక్తి స్వరూపిణి; ఆత్మ శక్తి స్వరూపిణి. రూపనామ క్రియారహితమైన ఆ ఆదిశక్తియే, సగుణంగా నారాయణ స్వరూపిణి, శివస్వరూపిణి, బ్రహ్మరూపిణి, యీ త్రిమూర్తుల సమ్మేళన శక్తి అయిన ప్రణవ స్వరూపిణి అమ్మ. అందువలననే ప్రణవమును ముందు చేర్చి జపించినపుడే ఏ మంత్రానికైనా శక్తి వస్తుంది. ఎందరెందరో మహాత్ములు ఎంతో research చేసి ప్రణవ బీజము అనంత శక్తివంతమైనదని గ్రహించారు. అ, ఉ, మ అనే మూడక్షరాల కలయికయే 'ఓమ్' అనే ప్రణవము. 'అ' బ్రహ్మ బీజము. 'ఉ' విష్ణుబీజము; 'మ' మహేశ్వర బీజము. ఈ మూడు శక్తుల కలయిక వలన ఏర్పడిన అనంత శక్తియే ప్రణవము. ఒకే విద్యుచ్ఛక్తి దీపాలను, ఫాన్‌లను, హీటర్లను, యంత్రాలను మరెన్నిటినో పని చేయించగలుగుతోంది. అలాగే ప్రణవము యొక్క అనంతశక్తియే సర్వ దేవతలకు, త్రిమూర్తులకు, సకల జీవకోటికి శక్తినిస్తూ, అన్నిటికి మూలమైయున్నది.

-సశేషం

# మాతాజీ అభిభాషణ

(గతసంచిక తరువాయి) -జపమాల ప్రసాద

అంతా బాగానే వుంది కానీ 'ఓం నమో హిరణ్యకశిపాయ' అనమంటే 'ఓం నమో నారాయణాయ' అనే అంటున్నాడు. ఇందాక మనం చెప్పుకున్న మోక్ష సాధానికి వున్న శమము, విచారణ, సంతోషము, సత్సంగము అనే నలుగురు ద్వారపాలకులనీ తన ఆధీనంలో వుంచుకున్నాడు ప్రహ్లాదుడు. అంతరింద్రియ నిగ్రహం కలిగివున్నాడు కనుకనే, తండ్రి ఎన్ని చిత్రహింసలు చేయించినా, ఆయన శాంతిగాను సంతోషంగాను ఉన్నాడు. ఆ చిన్నారి బాలుడికి నారాయణ నామస్మరణ, విచారణ తప్ప వేరే విచారణే లేదు. నాలుగుదిశలా వున్న



భగవద్విషయం విశేషంగా అనుభవించి ఆనందించడమే విచారణ. నిరంతరం సత్యవస్తువైన నారాయణుని ధ్యాసలో వుండటమే సత్సంగం. పై చెప్పిన నాలుగూ పుష్కలంగా ఉన్నాయి కనుక ప్రహ్లాదుడికి మోక్షం కరతలామలకం (అరచేతిలో ఉసిరికాయ) అయింది.

చరణ్‌దాసు అనే భక్తుడు అస్మద్గురుదేవులని యీ విధంగా ప్రశ్నించారు - "పితృదేవోభవ అని అంటారు కదా. మరి ప్రహ్లాదుడి తండ్రి, 'ఓం నమోనారాయణాయ అని అనవద్దు. నీకు కావాలంటే బ్రహ్మదేవుడినో, శివుడినో స్మరించుకో' అంటే వినలేదు. అది తండ్రిని అలక్ష్యం చేసినట్లు కాదా?" అని. శ్రీబాబూజీ మహరాజ్ సమాధానం చెప్తూ, "ప్రహ్లాదుడికి తల్లి గర్భంలో ఉన్నప్పుడే నారదమునీంద్రుల చేత 'ఓం నమోనారాయణాయ' అనే అష్టాక్షరీ మహామంత్రం ఉపదేశింపబడింది. కనుక అప్పటి నుండి అంటే తల్లిగర్భంలో వుండగానే, ఆ మంత్రాన్ని స్మరిస్తూ వున్నాడు ప్రహ్లాదుడు. తల్లిదండ్రుల కంటే ముందు ఎవరి బోధతో ఈ జగత్తులోనికి వచ్చాడు ప్రహ్లాదుడు? సర్వ జగత్తుకి ఆధారభూతుడైనవాని నామము గురుముఖతః వచ్చింది. కనుక, తల్లిదండ్రులకంటే కూడా గురువాక్యమే ప్రమాణం" అని శెలవిచ్చారు గురుదేవులు.

గురుమూర్తి ఉపదేశించిన మహామంత్రాన్ని నిరంతరం ఎవరయితే

రమత చేస్తారో వారు పూర్ణాయుర్దాయాన్ని పొందుతారని 'నారాయణోపనిషత్తు' చెబుతున్నది. అనేక కోట్లమంది కాలగర్భంలో కలిసిపోతున్నారు. కానీ భగవద్భక్తులయినవారి పేర్లు మాత్రం యీనాటికీ ప్రకాశిస్తున్నాయి. శాశ్వతత్వం కావాలి అంటే శాశ్వతమైన దానిని గుర్తించాలి. మన గురువులు, మహాత్ములు స్వస్థానానికి చేరుకున్నా మనకేం తక్కువ జరుగుతోంది? ఆదిశంకరుల చరిత్ర విని ఏ భక్తుడానందించడు? కానీ మహాత్ములు మనమధ్య మెలుగుతున్నంత వరకూ, వారిని గుర్తించరు. వారి అవతారం పరిసమాప్తి అయితే, అయ్యో అంటారు. షిరిడీసాయిబాబాని వారు శరీరాన్ని ధరించివుండగా ఎంతమంది మహాత్ముడిగా గుర్తించారు? ఈనాడు యిన్ని గుడులు, గోపురాలు కట్టిస్తున్నారు! భగవంతుడు అనేవాడు మన నమ్మకంలోనే వున్నాడు. మనం కాస్త పసుపు తీసుకొని, ముద్ద చేసి, వినాయకునిగా భావించి, చిన్న బెల్లంముక్క నైవేద్యం పెట్టి, పూజ చేస్తే మన కోరిక నిర్విఘ్నంగా తీరుతోంది!

దేవుడికి కావలసిన మనస్తత్వం మనం అలవరచుకోవాలి. మీలో ఒక దివ్యమైన శక్తి ప్రేరేపణ చేస్తేనే, మీరు ఏ పనైనా చేయగలుగుతున్నారు. ఆ అనంతశక్తిని ఏనాడూ కించపరచకూడదు. అది లేకపోతే గడ్డిపోచ కూడా కదలలేదు. మొన్న ఈ మధ్య ఎవరో, సాయిబాబావారి గుడికి రమ్మని ఆహ్వానిస్తూ, "మీరు వస్తే, మా గుడికి పవిత్రత చేకూరుతుందమ్మా" అని అన్నారు. నాకు చాలా బాధ, కోపం కూడా వచ్చాయి. అప్పుడు నేను వారితో అన్నాను - "ఇదేనా మీరు నమ్మిన దేవుడికి మీరు ఇచ్చే గౌరవం? మీరు నమ్మిన ప్రభువులో ఏమి తక్కువైందని యిటువంటి వెలితి మాటలు మాట్లాడుతున్నారు? గురుశక్తిని మీరు ఇదేనా అర్థం చేసుకున్నది?" అటువంటి అపశబ్దాలు నోటి వెమ్మట రాకూడదు. శబ్దం ఆకాశానికి గుణం. ఆ శబ్దాన్ని శ్రవణేంద్రియం ద్వారా మరొకరు వింటారు. శబ్దం ద్వారా పంచమహాభూతాలు, తద్వారా ఈ దేహము పవిత్రత చెంది, నీలో వున్న దేవుడిని పవిత్రంగా చూడగలుగుతావు. భగవంతుడూ, సద్గురునాధుడూ ఎప్పుడూ పవిత్రులే. నీ భావన పవిత్రత చెందాలి. నీవు కలుషశబ్దాలు ఉచ్ఛరిస్తే, నీ మనసు కూడా కలుషితమైపోయి, కలుషాన్నే నలుగురికీ పంచుతావు.

భగవంతుడు మన భోగభాగ్యాలకీ అట్టహాసాలకీ లొంగడు, అనడానికి మీకొక చిన్న కథ చెపుతాను.

ఒక దేశంలో ఒక మహారాజుండేవాడు. ఆయన గొప్ప శివభక్తుడు. ఆయన కోటానుకోట్లు ఖర్చుపెట్టి, ఎక్కడెక్కడి నుండో శిల్పులనీ, పనివారినీ తెప్పించి పాలరాతితో పెద్ద దేవాలయాన్ని నిర్మించాడు. ఒకమంచి ముహూర్తం చూపించి ప్రతిష్ఠకి తేదీ నిర్ణయించాడు మహారాజు. ఒకరాత్రి మహారాజుకి కలలో పరమశివుడు దర్శనమిచ్చి, "రాజా! నువ్వు గొప్ప గుడి కట్టించి అందులో నన్ను ప్రతిష్ఠ చేయాలని తేదీ నిర్ణయించావు. కానీ ఆరోజున, అదే ముహూర్తానికి, నా భక్తుడొకతను నిర్మించిన దేవాలయంలో ప్రతిష్ఠ వుంది కనుక, నేను అక్కడికి వెళ్తాను" అనే సరికి ఆ మహారాజు "ప్రభూ! ఆ అదృష్ట వంతుడెవరో శెలవిస్తారా!" అని అడుగుతాడు. అప్పుడు శివుడు, ఆ భక్తుడు ఫలానా గ్రామంలో వున్నాడని చెప్తాడు.

ప్రతిష్ఠ రోజు రానేవచ్చింది. "ఎవరబ్బా అంతగొప్ప భక్తుడు? నేను కట్టించిన గుడికంటే గొప్పది కట్టించాడా? అదేదో నేను చూసితీరాలి" అని మహారాజు, మందీమార్బలాన్ని వెంటబెట్టుకొని, శివుడు చెప్పిన గ్రామానికి వెళతాడు. ఆ ఊరంతా తిరిగి, అందరినీ అడిగినా కొత్తగా కట్టిన గుడి ఎక్కడుందో రాజుకి కనిపించలేదు. చివరికి రాజు, ఆ ఊరిలో శివభక్తుడెవరైనా ఉన్నారా అని వాకబు చేస్తే, ఊరి చివర వున్న ఒకతనిని గురించి తెలుస్తుంది. రాజు అక్కడికి వెళ్తే, అదొక పూరిపాక. సూర్యచంద్రులు అందులోనే ఉన్నారన్నట్టుంది పై కప్పు. ఆ పాకలో ఒకతను చక్కటి ధ్యాననిష్ఠలో మైమరచిపోయి వున్నాడు. ఆయన ధ్యాన నిష్ఠలోనుండి ఇవతలికి వచ్చాక, మహారాజు 'మీరేదో శివాలయం కట్టించారుట నిజమేనా? ఎక్కడుంది ఆ గుడి?' అని అడుగుతాడు. అప్పుడా భక్తుడు, "నిజమే, మహారాజా! నా హృదయంలో శమము, దమము, ఉపరతి, ...........శ్రద్ధ, సమాధానమనే foundation (పునాది) వేసి సత్యం, శాంతి, దయ, ప్రేమ అనే pillars (స్తంభాలు) మీద విశ్వాసమనే గోపురం పెట్టి, ఒక దేవాలయం నా హృదయేశ్వరుడికి నిర్మించుకున్నాను. ఇంకొన్ని నిమిషాలలోనే ప్రతిష్ఠా కార్యక్రమం. నా ప్రభువు నాలాంటి నిరుపేద కోరిక తీరుస్తాడో లేదో" అని అనగానే, మహరాజు తనకి వచ్చిన స్వప్నం గురించి చెప్పి, 'ప్రభువు నేను కట్టించిన గుడి ప్రతిష్ఠకి రాను అని చెప్పి, మీరు నిర్మించిన గుడిలో ప్రతిష్ఠ అవడానికి రానున్నానని చెప్పాడు' అని చెప్తాడు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గతసంచిక తరువాయి) - పరాశర ప్రసాద్

చూశారా! భక్తులకు భగవంతుడు ఎలా దాసుడయ్యాడో! ఇప్పుడు మీరే నిర్ణయించండి. హనుమ భక్తుడు అవునో కాదో అని చెప్పేసరికి ఆ పండితునికి కనువిప్పు కలిగింది అన్నారు శ్రీబాబు.

11-5-1985

ఈరోజు రాత్రి శ్రీబాబు దర్శనార్థము వచ్చిన భక్తుడు మాట్లాడుతూ మీరు విశాఖపట్నంలో ఇచ్చిన ఉపన్యాసాలు చాలా బాగున్నాయి అన్నారు. శ్రీబాబు మాట్లాడుతూ అది మీకు నా మీద ఉన్న ప్రేమను తెలియజేస్తోంది. సత్య దృష్టి ఉన్నవారికి అంతా మంచిగానే గోచరిస్తుంది. ఒక తండ్రికి బిడ్డల మీద ప్రేమేగాని ద్వేషం ఉంటుందా? అలాగే మీలో ఎవరన్నా నాకు చాలా ఇష్టము. నేను మీలో ఉన్న మంచినే చూస్తానుగాని, దుర్గుణాలు ఎన్ని ఉన్నా వాటిని చూడను. అవి మిమ్మల్ని పతనం చేస్తాయి అనుకుంటే హెచ్చరిస్తాను. పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఎవరైతే ప్రేమిస్తారో వారే మహాత్ములు. దానికి భిన్నంగా పిపీలికాది బ్రహ్మపర్యంతం ఎవరు ద్వేషిస్తారో వారు దానవులు లేక రాక్షసులు.

ఇంతలో శ్రీబాబు దర్శనార్థం వచ్చిన ఒక భక్తుడు మాట్లాడుతూ బాబూ! నాకు సెలవు ఇస్తే వెళదామనుకుంటున్నాను అన్నారు. శ్రీబాబు సమాధానం చెబుతూ ఇక్కడ కొన్ని రోజులు ఉందామనుకున్నారు కదా! ఎందుకు వెళ్ళిపోవాలనుకుంటున్నారు? మీరు ఇక్కడకి వచ్చిన పని అయిందా? పని పూర్తికాకుండా వెళితే ఏం లాభం? మీరు ఆత్మసాక్షాత్కారాన్ని పొందే మార్గం తెలియజేయమన్నారు. అది క్షణంలోనే సాధ్యపడుతుందా? దాని కోసం ప్రయత్నం చేయాలి. ఉండండి. నిరుత్సాహపడకండి అన్నారు.

ఆ భక్తుడు మాట్లాడుతూ ఇక్కడ మాలాంటివాళ్ళు ఉండలేరండీ. నేను వెళ్ళిపోదామనుకుంటున్నాను. మీరు అనుమతి ఇస్తే వెంటనే వెళ్ళిపోతాను అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ మీకు వచ్చిన సమస్య ఏమిటో నిర్భయంగా చెప్పండి. భగవంతుని విశ్వసించినవారికి ఏ భయమూ ఉండదు. భగవంతుడిని ఎక్కడ మరుస్తారో అక్కడే భయం. ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలి

అనుకున్నవారు అలా జారిపోతే ఎలాగండీ? మిమ్మల్ని ఎవరైనా దూషించారా? ఈ చిన్న చిన్న సంఘటనలకే మీ మనస్సు చలిస్తే ఎలా? భవిష్యత్తులో ఎన్నో పరీక్షలు ఎదుర్కోవలసి రావచ్చు అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ ఇక్కడికి మీరు వచ్చింది ఎవరి కోసం? నా కోసమే కదా! నేను మిమ్మల్ని ప్రేమించేటప్పుడు మీకు వచ్చిన లోటు ఏమిటి? నేను మీ ఇంటికి రావాలని కోరుకుంటున్నారు కదా! నన్ను మీ ఇంటికి రమ్మనమని ఆహ్వానించారు కదా! మరి మీరు ఇక్కడ ఉండకుండా వెళ్ళిపోయేటప్పుడు నేను మాత్రం మీ ఇంటికి ఎలా రాగలను? మీరే ఆలోచించండి. అయినా ఒక భక్తుడు నాతో మాట్లాడుతూ మీరు అప్పగించిన బాధ్యత నేను నిర్వహించలేను అన్నాడు. మీరంతా ఇలా అన్నట్లే నేను కూడా మీ అందరి బాధ్యతా నాకు ఎందుకని తప్పుకుంటే ఏమవుతుంది? ఎక్కడో ఒక మూల ధ్యానం చేసుకుంటూ కూర్చుంటే నాకు కాలం గడవకపోతుందా? నా జానెడు పొట్టకు మా అమ్మ లోటు చేస్తుందా? కానీ నేను అలా చేయ గలనా? మీ చుట్టూ ఉన్న భవలతలను త్రుంచి మీకు శాంతిని అందజేయటమే నా ధ్యేయం. మీ హృదయాలలో ఉన్న అజ్ఞానాన్ని హరించి జ్ఞానకిరణాన్ని ప్రవేశపెట్టి ఆనందాన్ని అందివ్వటమే నా మార్గము.

రామదాసుగారు ఈ యుగంలో భక్తుడే కదా! ఆయన చరిత్ర తెలుసుకదా? ఎన్ని కష్టాలు వచ్చినా రామనామ స్మరణ మరచాడా! మీరు మామిడి చెట్టు దగ్గరకు వెళ్ళి ఎంతో ఆకర్షవంతంగా ఉన్న ఫలాన్ని అందుకోవడానికి వెడతారు. కాని ఆ చెట్టు క్రింద ముళ్ళ పొదలు ఉంటాయి. అంతమాత్రం చేత ఆ ఫలాన్ని అందుకోవటం మానుకుంటారా? ఆ ముళ్ళ పొదలను అధిగమించి ఎలాగైనా సరే మోక్షఫలాన్ని అందుకుంటారు కదా!

మీ సాధన ఫలించాలంటే గురుసాన్నిధ్యం చాల ముఖ్యం. మిమ్మల్ని మాయ అనుక్షణం వెంటాడుతూనే ఉంటుంది. మాయ నుంచి మీరు బయట పడాలంటే గురుసాన్నిధ్యం అవసరం. గురు సాన్నిధ్యంలో బోధ, శ్రవణం, మననం, జరుగుతాయి అన్నారు బాబు.

భక్తుడు శ్రీబాబుని ప్రశ్నిస్తూ మరి మిమ్మల్ని కోరిన దానిని ఎప్పుడు ప్రసాదిస్తారు? అని అడిగాడు. శ్రీబాబు మాట్లాడుతూ మీరు చెప్పుల్లో కాళ్ళు పెట్టుకొని భగవంతుని దర్శనం ఎప్పుడు కలుగజేస్తారు, మా ఊరు వెళ్ళిపోవాలి అంటే జరిగే పని కాదు. మీరు నెమ్మది నెమ్మదిగా సాధన చేయండి.

సత్ఫలితాన్ని తప్పక పొందగలుగుతారు అన్నారు.

12-5-1985

ఈ రోజు రాత్రి శ్రీబాబు భక్తులకు బోధ చేస్తుండగా చరణదాస్‌గారు ప్రశ్నిస్తూ నేను చేసే ప్రతి పని భగవంతుడే చేయిస్తున్నప్పుడు తప్పు ఒప్పులతో పని ఏముంది? నేను చేసే తప్పులకు బాధ్యత ఎవరిది? అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ నేను చేసే ప్రతి పని భగవంతుడే చేయిస్తున్నాడు అనే భావనే ఉంటే ఆ వ్యక్తి ఎన్నడూ తప్పు చేయడు అన్నారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ కర్మ అంటే ఏమిటి తారకం? అని ప్రశ్నించారు. మంచి పని చేయటం అని తారకంగారు సమాధానం చెప్పారు. అదేమిటయ్యా ! అలా చెబుతావు? కర్మ అనేది సుకృత కర్మ అవ్వచ్చు లేదా దుష్కృత కర్మ అవ్వవచ్చు. 'సు' అంటే ఆత్మవస్తువు కదా! నువ్వు ఏ పని చేసినా అది భగవత్పరంగా చేస్తే అది సుకృతకర్మ అవుతుంది. దానికి భిన్నంగా ఈర్ష్య, అసూయ, రాగద్వేషాలతో చేసే ఏ పనియైనా దుష్కృతకర్మ అవుతుందికదా! మరి ఇప్పుడు చెప్పు దాస్! నీ సందేహం ఏమిటో అన్నారు బాబు.

ఇంకా బోధ కొనసాగిస్తూ కర్మలో అకర్మ అని పిలువబడేది సుకృతకర్మ. నువ్వు ఏ పని చేస్తున్నాను అనే భావన లేకుండా ఫలితాన్ని ఆశించకుండా భగవంతుని ప్రతినిధిగా చేసినట్లు అయితే దానిని కర్మలో అకర్మ అంటారు. శబ్ద స్పర్శ రూప రస గంధాలకు బంధితులై రాగద్వేషాలకు దాసులై చేసే కర్మ నీకు బంధమై జన్మకు కారణమవుతుంది.

ఒక దృశ్యాన్ని కంటితో చూసినంత మాత్రాన అది బంధాన్ని కలిగించదు. కంటితో దృశ్యాన్ని మనస్సు సహితంగా చూసి ఆకర్షింపబడి మెహింపబడితే అది బంధాన్ని తెచ్చి పెడుతుంది. అలాగే కార్యము నిర్వహించేటప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా చేసినట్లయితే ఆ కర్మ నీకు అంటదు. దానినే కర్మలో అకర్మ అంటారు. ఈ పని నేను చేస్తున్నాను అనే భావన ఉండకూడదు. ఏ పనికైనా కర్తవి నీవు కాదుగా. నేను ఇలా అంటే వెంటనే మన దాస్ ప్రశ్నిస్తాడు, కర్తని నేను కానప్పుడు నేను చేసిన తప్పు యొక్క ఫలితాన్ని నేను ఎందుకు అనుభవించాలి! అంటాడు. దానిని అలా అర్థం చేసికోకూడదు. మనస్సు ద్వారా సంకల్పించి చేసిన ప్రతి పనికి కర్తవి నీవే, దాని కర్మఫలాన్ని అనుభవించక తప్పదు. మీకు ఇంకొక విషయం చెబుతాను. అది ఇంకా విచిత్రంగా ఉంటుంది.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**నవంబరు 2010**

| | | |
|---|---|---|
| 1 | సోమ | శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 4 | గురు | మాస శివరాత్రి, నరక చతుర్దశి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. |
| 5 | శుక్ర | దీపావళి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన, రాత్రి 8 గంటలకు టపాసులు పేల్చుట |
| 9 | మంగ | నుండి 17 బుధవారం వరకు ప్రతి రోజు ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో నవ రసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన |
| 17 | బుధ | క్షీరాబ్ధి ఏకాదశి, శ్రీ సత్యనారాయణవ్రతం, శ్రీ సద్గురు పాదపూజ |
| 18 | గురు | శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన |
| 21 | ఆది | గురుపూర్ణిమ, శ్రీగురునానక్ జయంతి ,శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన, సాయంకాలం శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వరుల నగర దర్శనోత్సవం, జ్వాలాతోరణం,చాతుర్మాస్య దీక్షా విరమణ |

**నవంబరు 24బుధవారం నుండి డిశంబరు 1బుధవారం వరకు శ్రీ గురుదేవుల ద్వావింశతి వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు**

24 బుధవారం ఉదయం7గం॥34ని.లకు పంచ యజ్ఞ సహిత పుణ్యారాధన మహోత్సవ సాప్తాహ్నిక దీక్షా స్వీకరణ,అఖండ జ్యోతి ప్రజ్వలనం, పంచ యజ్ఞ ప్రారంభం. ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామ తారక పరబ్రహ్మ ప్రసాద్, శ్రీ వెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీ గురుగీతా ప్రవచనము.

25వ తేదీనుండి - 30వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గం.లకు సుప్రభాతం, నగర సంకీర్తన 5 గం.లకు ప్రాతఃకాల ప్రార్థన, మహా మంగళహారతి.6గం.లకు బ్రహ్మశ్రీ కొండూరు రామ సుబ్రహ్మణ్యంగారిచే వేద పఠనము, ఆలయ దర్శనములు, తీర్థ ప్రసాదములు

24 - 30 వరకు మధ్యాహ్నం శ్రీ సద్గురు శత సహస్ర నామార్చనము, మహామంత్ర పుష్పము, దర్బారు. అనంతరం శ్రీ మాతాజీవారు భక్తులకు తీర్థం ఇస్తారు. భక్త సమారాధన సాయంత్రం 6

గం.లకు ప్రార్థన మహా మంగళహారతి.

25 - 30 వరకు ఉదయం 9 గం.లకు సత్సంగ సమావేశము, శ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణ సద్గురుదేవుల దర్శనము, బోధ (వీడియో). శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువుల మ్యూజియమ్ -సందర్శన (అర్ధగంట)

27 శని రాత్రి 7 గం॥లకు శ్రీ సద్గురుదేవుల ఊంజలసేవ(డోలోత్సవం)

28 ఆది ఉదయం 7గం॥లకు సామూహిక సద్గురు పూజలు.

29 సోమ రాత్రి 7 గం..లకు నౌకావిహారం(తెప్పోత్సవం)

30 మంగళ ఉదయం 10 గం.లకు శ్రీ సద్గురుదేవుల పాద పూజ రాత్రి 7 గం.లకు శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన.

**డిశంబరు 2010**

1 బుధ తె.జా. 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక చమక సహిత మహాభిషేకము. ఉదయం శ్రీ సద్గురు పాదపూజ దీక్షావిరమణ, మహామంగళహారతి, నగరోత్సవం.

**గమనిక :** పెద నింద్రకొలను ఆశ్రమశాఖలో శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సత్సంగం, తెప్పోత్సవం.

3 శుక్ర శ్రీ సద్గురుదేవులు ఆంగ్ల కాలమాన ప్రకారం స్వస్వరూపలయం పొందిన రోజు,శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, శ్రీ సద్గురుదేవుల నగరోత్సవము

4 శని మాస శివ రాత్రి

11 శని శ్రీ సుబ్రహ్మణ్యషష్టి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, సహస్రనామార్చన.

**17 శుక్రవారం నుండి ధనుర్మాస కార్యక్రమాలు** - ఉదయం 9.30 గం,లకు సంకీర్తన, 10 గం. లకు తిరుప్పావై, 10.30 గం.లకు ఋషుల చరిత్ర, 11 గం.లకు శ్రీమదాంధ్ర మహాభాగవత ప్రవచనము, సత్సంగం, ప్రార్థన, తీర్థ ప్రసాదములు.

17 శుక్ర గీతా జయంతి, ముక్కోటి ఏకాదశి, శ్రీ సద్గురు పాదపూజ, ఏకాహం, భక్త సమారాధన

21 మంగ పూర్ణిమ, దత్తాత్రేయ జయంతి, శ్రీ సద్గురు పాదపూజ

25 శని క్రిస్మస్ - శ్రీసద్గురు పాదపూజ. సత్సంగం.

30 గురు గురుదశమి, సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ

# శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు-1

## అమ్మ అనురాగం

శ్రీదేవీ నవరాత్ర మహోత్సవాలు శ్రీ గురుదేవులు మనకు స్వయంగా ప్రసాదించిన గొప్ప మహదవకాశం. ఈ రోజు అమ్మ లక్ష్యరూపాన్ని పొంది మహాలక్ష్మిగా ప్రకాశిస్తోంది. అమ్మ లక్ష్యం ఏమిటంటే భక్తుల కోర్కెలు తీర్చటమే! మనస్సు, బుద్ధి, చిత్తాహంకారాలను గురుపాదాలపై ఉంచితే, సంకల్పించేసే మనస్సు సత్యంగాను, ఊహించే చిత్తం శాంతిగాను, నిర్ణయించే బుద్ధి దయగాను, ఆచరణలోకి తెచ్చే అహంకారం ప్రేమగాను మారి మనస్సు నిర్మలమవుతుంది. సత్యం, శాంతి, దయ, ప్రేమ అనే, పీఠంపై శ్రీ గురుదేవులు విరాజిల్లుతున్నారు. ఆయనను గుర్తించాలంటే మనస్సు సత్యమై ఉండాలి.

అమ్మ లేకుండా ఏదీ లేదు. "ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపిణ్యైనమోనమః" అని అమ్మనామాలలో ఉంది. దశేంద్రియాలు శాంతి చెందితేమనలోని అజ్ఞానం నశిస్తుంది. దశమినాడు అమ్మ ఆనందంగా ప్రకాశిస్తుంది. బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తుంది. జ్ఞానక్షీరాలను అందిస్తుంది.

జీవిత పరమార్థాన్ని గుర్తించాలంటే, సద్గురువుల అనుగ్రహం ఉండాలి. వివేకమనే ఖడ్గంతో అనిత్యమైనదాన్ని ఖండిస్తే మనస్సు శుద్ధమవుతుంది. శుద్ధమనస్సులో అమ్మ ప్రకాశిస్తుంది. మానవజన్మ వచ్చినందుకు అమ్మఅనుగ్రహాన్ని, అనురాగాన్ని పొందగలగాలి.

**నీ అనురాగమే దేవీ నిఖిలావని నిండెనులే,** అనే పాట శ్రీ గురుదేవులు ఎంతో ఇష్టంగా వినేవారు. "భగవంతుని అనుగ్రహానికి పాత్రులు కండి బ్రాకెట్‌లో గురుదేవులు" అనేవారు శ్రీ గురుమహరాజ్. మనం అనురాగమనే సముద్రంలో ఉన్నాం. భగవన్నామం అందరం చేశాం. మరి భగవన్నామం అంతటా ప్రతిధ్వనించలేదా? మల్లెల సుగంధాన్ని దాచగలమా? మనస్సును సుగంధపూరితంగా చేసుకోవాలి. అమ్మలో ఉన్న సర్వేశ్వరత్వాన్ని, సర్వజ్ఞత్వాన్ని అలవరచుకోవాలి.

ఊర్ణనాభి తను కట్టిన గూటిలో తనే చిక్కుకొని మరణిస్తుంది. అలాగే మానవుడు మనుగడలోనేనాశనమవుతున్నాడు. మనోమలం అంటే వాసనలచేత పతనమవుతున్నాడు.

మహాత్ములు మనస్సును విశాలం చేసుకోమన్నారు. అమ్మ అనురాగం అంతటా నిండి ఉంది. అంటే ఈ‘ స్పేస్’ అంతా ని ండి ఉంది. వారు దానిని గుర్తించమన్నారు. అమ్మ అనురాగధారలు విమలమైనవి. నిర్మలమైనవి. మలరహితమైనవి. ఆ ధారలలో చిగురిస్తోంది. మంచి భావనలలో ఉన్న మనస్సు ఆనందాన్ని పొందుతుంది. చెడు భావనలతో ఉన్న మనస్సు దుఃఖాన్ని పొందుతుంది. అనురాగమనే చలువ పందిరిలో శాంతి సుఖాలు నెలకొంటాయి. ఒక్కక్షణం కళ్ళు మూసుకొని మనః ఫలకంలో అమ్మను దర్శించండి. అమ్మ అనురాగాన్ని చూరగొన్న మనస్సు శాంతి సుఖాలకు నిలయమవుతుంది.

మన దృష్టిలో గురువు అగంతకుడు.కాని మనమే అగంతకులం. భూమి గ్రహం సూర్యునివైపు తిరిగితే సూర్యుడు ఉదయించాడు అంటాం. సూర్యునికి విముఖంగా ఉంటే అస్తమించాడు అంటాం. సూర్యుడు ఎప్పుడూ ఉన్నాడు. అయినా సూర్యుణ్ణి ఆగంతకుడుగా భావిస్తాం. అలా మనమే వచ్చిపోయేవాళ్ళం. ఆగంతకులం.

అసహాయులైన వారికి ఆశాజ్యోతి ఎవరు? అమ్మే! మనం ఎవరి తోడుతో ఉన్నాం? ఎవరితోడుతో ఉన్నా నీకు తోడ్పడేది అమ్మే! మనం అమ్మ కడుపులో ఎలా దూరాం? ఆ ప్రణాళిక అమ్మదే. అమ్మ తన సంకల్పమాత్రంచేత జ్ఞానక్షీరాలను మనకు అందిస్తుంది.

మనం దేవుణ్ణి ఒక గదిలోనో, గూట్లోనో పెట్టి దేవుడు ఇంట్లో ఉన్నాడనుకుంటాం. ఒకామె వంటింటి స్టౌవ్ ఉండేచోట గట్టుపైన దేవుడిని పెట్టి, అంతా ‘డైరెక్టేనమ్మా’ అంది.చూడండి! మానవుడు ఎంత మొనగాడో! ఇక్కడ ఇల్లు అంటే నీ హృదయం. అమ్మ అంతటా ఉంది. అన్ని రూపాలూ ఆమెవే. అంతటా ఉన్న అమ్మ నీ ఇంట్లో లేదా? ఇప్పుడు చెప్పండి, అమ్మ అనుగ్రహం ఎక్కడ లేదు? అంటే బ్రాకెట్‌లో గురుదేవుని అనుగ్రహం.

మూర్తులు ఎప్పణ్ణించో ఉన్నాయి. వాటిలో అమూర్తత్వాన్ని అనుగ్రహించేది గురుదేవులే! అటువంటి అనుగ్రహాన్ని పొందటానికే మానవజన్మ వచ్చింది. ఆ అనురాగాన్ని, అనుగ్రహాన్ని ప్రసాదించేది శ్రీ గురుదేవులే. ఆయన సన్నిధిలో ఉన్నాం. ఆయనే మన పెన్నిధి. *

# శ్రీమాతాజీవారి నవరాత్రి సందేశాలు-2

(గాయత్రీ మంత్రం) -పద్మ. విజయవాడ

శరన్నవరాత్రి మహోత్సవాలలో శ్రీమాతాజీవారు గాయత్రీ మంత్ర విశిష్ఠత గురించి భక్తులకు బోధించారు.

**ఓం భూః భువః ఓగ్ం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓగ్ం సత్యం । ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి। ధీయో యోనః ప్రచోదయాత్ ॥**

అనే మంత్రం ఏ దేవతను ఉపాసన చేసినా ముక్కు పట్టుకుని జపించవలసినదే. ముక్కు పట్టుకుని, శ్వాస తీసికొని వదిలి కుంభించటం అనే క్రియలు చేస్తూ మంత్రాన్ని జపించగలుగుతాడా? క్రియలు ముఖ్యం కాదు, భావం ముఖ్యం. తెలియనివాడు ముక్కు పట్టుకుంటాడు. తెలిసినవాడు ముక్కు పట్టుకోవలసిన అవసరం లేదు. పూజకి ప్రధానమైనది మనస్సు. దానికి అడ్డం వచ్చే భూత పిశాచ భావాలకు కారణభూతమైన ఆదిభౌతిక ఆది దైవిక ఆధ్యాత్మిక తాపములను వదిలించుకోవటానికి చేసే ప్రయత్నమే గాయత్రీ మంత్రం. అవి జన్మజన్మల నుంచి మనస్సుని పట్టుకొని అశాంతికి కారణం అవుతున్నాయి.

గాయత్రి మంత్రం జపిస్తూ మనం ప్రపంచంలో ఉన్నాము కాబట్టి సర్వ సృష్టికి జగత్తుకి ఆధారమైన మంత్రమూర్తి నా ప్రభువు ఉన్నాడు తస్మాత్ జాగ్రత! అని హెచ్చరిస్తూ మేము బ్రహ్మకర్మలో ఉన్నాము అని భూతాలను వదిలించుకోవాలి. పదునాలుగు లోకాలలోనూ ప్రకాశించేది ఓంకారమనే ణవము. అది అనంతంగా వ్యాప్తమై ఉన్నది. దానిని శ్రవణం చేసినవాడు పాపవిముక్తుడు. దానిని ఉపాసన చేసినవాడు భక్తుడు. అనుభవించినవాడు జ్ఞాని. అనంతంగా ప్రకాశించే ప్రణవంలో మనం ఉన్నామా? లేమా? గమనించాలి. ఉన్నాను అని నీ ఉనికిని గుర్తింపజేసేది "తానే". అదే గురుశక్తి. భగవంతుడు అవకాశాన్ని ఇస్తాడు మరి ప్రయత్నం చేయవలసినది ఎవరు? గుర్తించండి. పురుషోత్తముణ్ణి గుర్తించే ప్రయత్నమే పురుషప్రయత్నము. శ్రవణం చేసిన దానిని మనస్సులో భద్రపరచుకోవాలి. భద్రపరచుకొన్నదాన్ని విచారణ చేయాలి. విచారణ ద్వారా నిధిధ్యాసకి వస్తుంది. అదే అనుభూతి. అనుభవించినది తాత్కాలికమైనది కాదుకదా! అన్నారు శ్రీమాతాజీ. *

# ఆవేదన

-మేధ

శ్రీబాబూజీ మహరాజ్ ఆంధ్రప్రభ ఎడిటర్ కూచిమంచి సుబ్రహ్మణ్యం గారిని పితాజీ అని పిలిచేవారు. ఆయన కుమార్తె గొలుసు పోయింది. ఎంతో ఆవేదన చెందారు. ఇంట్లో వెదకని చోటు లేదు. ఆ వస్తువు దొరికితే రామలింగేశ్వరునికి అభిషేకం చేస్తానని శ్రీబాబూజీ మహరాజ్‌కు చెప్పారు.

భగవానుడు అల్ప సంతోషి, భక్త ప్రియుడు కనుక రెండు బిందెల నీళ్ళతో అభిషేకం చేసినా, రెండు లీటర్ల పాలతో అభిషేకం చేసినా తృప్తి పడతాడు. ఆయన ఎన్నడైనా ఎవరికైనా లోటు చేస్తాడా ! ఆడిన మాట తప్పేవాడు మానవుడు. పితాజిగారికి గొలుసు దొరికింది. గొలుసు దొరికింది కదా! అభిషేకం చేయాలా అని ప్రశ్నించాడు. శ్రీబాబూజీ మహరాజ్ సమాధానం చెబుతూ "అభిషేకం చేయటం చేయకపోవటం సంగతి అలా ఉంచండి. పోయిన వస్తువు కోసం రాత్రనకా పగలనకా ఎంతో కష్టపడి అన్నపానాదులు మానుకొని వెతికారు కదా! భగవంతుడు అనుగ్రహించి లభింపజేసాడు అనుకోండి దొరుకుతుందని గ్యారెంటీ అయితే లేదు కదా!

కాని అంత ఆవేదనతో వెతికితే దొరికే వస్తువు ఉంది. కాలం అయిపోతోంది. వయస్సు మీద పడుతోంది. అదృష్టం కొద్దీ లభించిన ఈ మానవ జన్మ తిరిగి లభిస్తుందని గ్యారెంటీ లేదు. మిమ్మల్ని ప్రేమించి హెచ్చరించే సద్గురుమూర్తి లభిస్తాడని గ్యారెంటీ లేదు. సంస్కారబలంచే లభించిన ఈ సదవకాశాన్ని జారవిడుచుకోవటం ఏం సమంజసం? గొలుసుపోవటం అనేది ఒక సంఘటన. విశ్వాసం పెంపొందించుకోవటానికి ఒక మహదావకాశం.

మీ జన్మరాశి ఏమిటో తెలిసికోవటానికి మీ సమయాన్ని వినియోగిస్తే అది నిత్యకాలంలో జమ అవుతుంది. ఈ సంఘటనలు వారివారి పూర్వజన్మ కర్మలననుసరించి జరుగుతాయి. వాటిని అర్థం చేసుకోవటం కష్టం. దాన్ని గురించి తెలిసినవారు ఎవరైనా ఏమైనా చెబితే నమ్ముతారా? పోయిన గొలుసు ఏ జన్మలోనో ఎవరికో ఋణగ్రస్థుడవై పోయింది అని చెబితే పితాజీ నమ్ముతారా? ' సద్గురుమూర్తి ఏదో విధంగా నచ్చచెప్పటానికి చూస్తున్నారు' అంటారు. పోనీ రామలింగేశ్వరునికి అభిషేకం చేసుకుని ఋణం తీర్చుకుంటే నీ ఋణాన్ని ఆయన ఏదో విధంగా సరిచేస్తాడు అనే ఉద్దేశ్యంతో చెబితే అభిషేకం చేయాలా? అని ప్రశ్నిస్తే నేను ఏం చెప్పగలను?'ఇలా ఉంటాయి మా తిప్పలు. సద్గురుమూర్తిని సరిగా అర్థం చేసుకొని సంచరించగలిగిన వాడే నిజమైన సాధకుడు. *

# సంత్ నామదేవ్ చరితామృతం

(గతసంచిక తరువాయి) -మనోజ్ కుమార్

కాని ప్రస్తుతానికి మాత్రం నీవు కొంతకాలం పాండురంగడి చరణాల దగ్గర విశ్రాంతి తీసుకో. పాండురంగడు నీకోసం ఎదురు చూస్తున్నాడు. జని నీకోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నది. రాజాయి నీకోసం పిచ్చిది అయింది. వృద్ధులైన నీ తల్లిదండ్రుల ప్రాణాలు ఇప్పుడో ఇంకాసేపటికో అన్నట్లు ఉన్నాయి. ఇక సుఖంగా పంఢరికి వెళ్ళి వారందరినీ చింతాముక్తులను చేసి వారికి ఆనందాన్ని ప్రసాదించు. ఇది నీ మిగిలిన కర్తవ్యం. తరువాత నీవే పాండురంగడివి, నీవే నారదుడవు, నీవే పుండరీకుడవి, నీవే చంద్రభాగవు, నీవే భీమా, నీవే జ్ఞానదేవుడవు.' నామదేవుడి ఒడలు పులకరించింది. ఇంద్రాయిణి తరగలమీదుగా ఉయ్యాలలూగుతూ వయ్యారంగా వచ్చి ఒక చిన్న పిల్ల తెమ్మెర నామదేవుడి చెక్కిలిని మృదువుగా స్పృశించింది. నామదేవుడి భావసమాధి చెదిరింది. తరువాత నామదేవుడు సోపానదేవుడి సమాధి వద్దకు వచ్చి తులసిదళం ఉంచి నమస్కరించాడు. పరమాత్మ సగుణ నిర్గుణ ఏకాత్మ భావన దర్శనం ఇచ్చింది. నామదేవుడు పంఢరి దిశగా ప్రయాణం సాగించాడు.

గ్రామ గ్రామాలనుండి ఆషాఢ ఏకాదశికి పంఢరి చేరటానికి వారకర్లు పంఢరి దిశగా నడుస్తున్నారు. నామా కూడ వారితో పాటు భజనలు పాడుతూ ప్రయాణం చేస్తున్నాడు. పండిపోయిన జుట్టు, వృద్ధాప్యం వల్ల నామదేవుణ్ణి ఎవ్వరూ గుర్తించలేదు. పంఢరి రాగానే పుండరీకుడి దర్శనం చేసుకుని చంద్రభాగ యిసుకను నెత్తిమీద జల్లుకున్నాడు. పంఢరి మారలేదు. ముఖాలు మాత్రమే క్రొత్తవి కనిపిస్తున్నాయి. తరువాత మల్లికార్జున స్వామి గుడివైపు నడిచాడు. ఎవరో అభంగం శ్రావ్యంగా పాడుతున్నారు“గజచర్మం ధరించావు, మెడలో వాసుకి భూషణంగా శోభిల్లుతున్నాడు.........” నామదేవుడు దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడుస్తూ 'నరహరీ! నీ జన్మ ధన్యమయిందయ్యా! నీవు పోయినా నీ అభంగాలను అందరి హృదయాలలో నింపి పోయావు.' అనుకున్నాడు. చోఖాబా సమాధి దాటి గుడిలోకి వచ్చాడు. గరుడ మంటపంలో పరిసా భజనలో లీనమైపోయి ఉన్నాడు. 'పరిసా! నా ప్రియశిష్యా!' అనుకుంటూ పరిసా పాదాలపై పడి నమస్కరించాడు నామ. ఆ స్పర్శకు పరిసా ఒడలంతా పులకరించింది. ఆ స్పర్శ తనకు బాగా పరిచయమైనదే. గాఢ సుషుప్తిలోకూడా

ఆ స్పర్శను తను గుర్తించగలడు. అవును. సందేహం లేదు అది తన గురుదేవులదే. పరిసా సంభ్రమంగా అమాంతం వంగి నామదేవుణ్ణి లేవదీసి 'గురుదేవా! ఈ మీ శిష్యుణ్ణి లజ్జితుణ్ణి చేయకండి. మీరు వెళ్ళినప్పటినుండి మీ కీర్తనలే, అభంగాలే పాడుతూ మీ రాకకై చంద్రుడి కోసం చకోరంలా ఎదురుచూస్తూ ఇక్కడే ఉన్నాను. భజనలో లీనమై మీ రాకను గుర్తించలేదు. నన్ను క్షమించండి' అంటూ గురుదేవుని పాదాలను చుట్టేసి నిర్మలమైన తన కన్నీళ్ళతో అభిషేకించాడు. నామదేవుడు పరిసా భుజాలపై చేయి వేసి లేవదీశాడు. ఇద్దరూ గుళ్ళో ప్రవేశించారు.

నామదేవుడు దండం పెట్టుకోగానే రంగడిపైన ఉన్న మల్లెపూలు నామదేవుడి తలపై పడ్డాయి. పరిసా నామదేవుడి చేయి పట్టుకుని నడిపిస్తుంటే ఇద్దరూ నామదేవుడి ఇంటికి బయలుదేరారు. దామాశెట్టి వణుకుతున్న కంఠంతో 'ఒరే నామా! వృద్ధుడైన ఈ తండ్రిమీద అలిగి వెళ్ళిపోయావా బాబూ? ఇక్కడ మీ అమ్మ నిండు ఇంట్లో ఉపవాసాలతో నీ కోసం ఎదురు చూస్తున్నది' అని గొణుక్కుంటున్నాడు. రాజాయి ఎక్కిళ్ళ మధ్య పూడుకుపోయిన గొంతుతో 'ఒరే విఠలా! చెప్పబ్బా! నా పసుపు కుంకాల గాథ. వాటినిచ్చిన నా పతి దేశాంతరం వెళ్ళాడు. భార్యనైన నా ప్రాణాలు గొంతులో ఉన్నాయి' అంటున్నది. జని 'నా స్వామి తిరిగి ఎప్పుడు వస్తాడో చెప్పు కేశవా! నా కర్మరేఖలన్నీ అతని పాదాలచెంత ఉన్నాయి. తిరగలి ఎంతని త్రిప్పను. చేతులన్నీ బొబ్బలెక్కాయి,' వికలమైన మనస్సుతో అడుగుతున్నది.

ఆ సమయంలో ఇంటి బయట అరుగుమీద నామదేవుడు వచ్చిన సవ్వడి వినిపించింది. అందరూ బిల బిలమంటూ బయటకు వచ్చారు. నామ కాళ్ళు కడుక్కుని దేవుడి గదిలోకి వచ్చాడు. రాజాయి నామా పాదాలను చుట్టేసింది. జని ఆనందంతో మాటలు రాక చిత్తరువులా నిలుచుండిపోయింది. దామాసెట్టి వణుకుతూ ప్రేమగా నామా భుజాలపై చేయి వేశారు. ఇంతలో గుళ్ళోకి వెళ్ళిన నామా కొడుకులు కూడా ఇంట్లోకి వచ్చారు. కుటుంబ సభ్యులందరూ చేరారు, పురిటికి పుట్టింటికి వెళ్ళిన లాడాయి తప్ప. అందరి స్పర్శలో నామదేవుడికి రంగడే కనిపించాడు. అందరి కళ్ళలో గంగా యమునలు. ఆ పొంగివచ్చిన గంగ యమునలు పరిసాని సైతం ముంచివేశాయి. నామదేవుడి రాక అందరికీ తెలిసింది. మొత్తం పంఢరి అంతా నామా ఇంట్లో గుమి కూడింది. నామా అందరినీ ఆప్యాయంగా పలకరించాడు.

మూడవనాడు రాత్రి నిద్రపోయిన దామాశెట్టి దంపతులు మర్నాడు ఉదయం లేవలేదు. ఆ నిద్ర వారి పాలిట దీర్ఘ నిద్ర అయింది. ఒకే చితిపై తల్లిదండ్రుల మృతదేహాలను ఉంచి, అగ్ని ముట్టిస్తూ తనలోతాను గొణుక్కున్నాడు నామా 'దామా! ఇవాళ్టి వరకు పుత్రుడిగా మీ విషయంలో ఏ కర్తవ్యం పాటించలేదు. ఈ అంతిమ కర్తవ్యాన్ని విఠలుడు నాచేత చేయిస్తున్నాడు.'

తల్లిదండ్రుల కర్మలు అయినతరువాత నామా క్షవరం చేయించుకుని శుచిర్భూతుడై గుళ్ళోకి వెళ్ళాడు. పాండురంగణ్ణి తనకు సమాధి నివ్వటానికి అతి కష్టంమీద ఒప్పించాడు. విఠలుడు "నిన్ను నాలో ఐక్యం చేసుకుని అనంత అద్వైత లాభాన్ని అనుభవిద్దాం అనుకున్నాను. ఆ ఆశ అలాగే ఉండిపోయింది. అది అడియాశ అయింది. మిగిలింది నిరాశే. ద్వైతమే మిగిలిపోతున్నది. నేను గుడిలో ఇటుకపైన, నీవు ద్వారం వద్ద, మెట్ల వద్ద సమాధిస్థితుడవై. ఈ బాధ చాలదా! సరే నీ గురించి నేను ఇది కూడా సహిస్తాను. ఇంటికి వెళ్ళి నీ సమాధి విషయం అందరికీ నచ్చచెప్పు. వారికి వారి కర్తవ్యం బోధించు. అప్పటిదాకా పరిసా నీ సమాధికి కావలసిన ఏర్పాట్లు చూస్తాడు." విఠలుడి మూర్తి కనులలో నుండి అశ్రువులు కారుతున్నాయి.

**నామ -** రంగా! ఏమిటిది? విగ్రహం ఏడ్వటమా!

**విఠల -** మరి నన్ను భోజనం చేయమని, చేయకపోతే తల బండకేసి బాదుకుని చస్తానని హఠం పట్టి నాచేత భోజనం చేయించావు గుర్తుందా? అప్పుడేమైందిరా ఈ తెలివి?

నామా మెల్లగా గుడినుండి బయట పడ్డాడు. మెట్లమీద జని కూర్చుని ఉన్నది. నామా బయటికి రాగానే అతడి పాదాలు గట్టిగా చుట్టేసింది. ఏడుస్తూ, గద్గద స్వరంతో 'నా స్వామీ ! చిన్న పిల్లల ఆటలలో కూడా నేను ఒక్కదాన్నే ఆడుకున్నాను. ఇప్పుడు నాతో ఆడుకుందువు రా. అనాహతం అనే గాలి విసురుతూ నిర్గుణమనే పొయ్యిమీద అద్వైతం అనే గిన్నెలో కైవల్యం అనే అన్నం వండుతాను. భక్తిప్రేమరసంతో పాయసం చేస్తాను. ప్రసాదం స్వీకరించి వెళ్ళండి. ఈ పిచ్చి దాసి జనిని కృతార్థురాలిని చేయండి" అంటూ ఇంకా ఎక్కిళ్ళ మధ్య" నీవు రంగడితో మాట్లాడిన ప్రతి అక్షరం నాకు ఈ మెట్టు చెప్పింది. నీవు సమాధిని పొందబోతున్నావు. స్వామీ! ఈ జనిని ఇలా ఒంటరిదానిని చేసి వెళ్ళకు. నాకు కూడా సమాధి ఇప్పించు. -సశేషం

# కృష్ణతత్వము, ప్రేమ యోగము

- సుషుమ్న ప్రసాద

(గతసంచిక తరువాయి)

భగవాన్ శ్రీకృష్ణుడి మాటలతో, భీమసేనుడు కోపోద్రిక్తుడై "మీరు వరాన్ని ప్రసాదించే ముందు, బాగుగా ఆలోచించి ఉండవలసినది. మీరు మా రక్షణ కొచ్చారా లేక మాకు అవరోధములను కలిగించటానికి వచ్చారా?" అని ప్రశ్నించాడు. అలా మాట్లాడి భీముడు మిన్న కున్నాడు. అప్పుడు అర్జునుడు సంపూర్ణ విశ్వాసము, వినయ విధేయతలతో "మీరేమంటున్నారు ప్రభూ! మీరు చేసే ప్రతి క్రియ వెనుక ఏదో పరమార్థముంటుంది. ప్రవీరునకు మీరు ప్రసాదించిన ఆయుధములు నాకు కూడ ఏదో మేలును సూచిస్తాయను కొంటాను. అందువల్ల నేనేమీ చింతించటము లేదు. మీరే మా సర్వస్వము. అశ్వమేధ యాగము మీరు సూచించినట్లే, మీ అనుగ్రహంతోనే ప్రారంభించాము, కనుక మీరు ఏది మాకు మంచిది అని అనుకొంటారో, అదే చేయండి" అని ప్రార్థించాడు.

శ్రీకృష్ణ భగవానుడు వెంటనే ఇలా సమాధానమిచ్చాడు "మనమిరువురము పరమశివుని కలుసుకొనుటకు వెళ్దాము. ఆయన ఈ క్లిష్ట పరిస్థితి నెదుర్కొనుటకు తగిన సలహా ఇవ్వగలడు. వెంటనే వారిరువురు కైలాస గిరికి చేరుకొని, పరమ శివుని కలుసుకొన్నారు. శ్రీకృష్ణ ప్రభువు తాను ప్రవీరుని భార్య మదన మంజరి భక్తి ప్రపత్తులకు, ధైర్య సాహసములకు ముగ్ధుడై, ప్రవీరునకు కౌమోదకమును, సుదర్శన చక్రమును ప్రసాదించినట్లు, అవి చెంత నుండగ ప్రవీరుణ్ణి ఎవ్వరూ పరాజితుని చేయలేరు. అందుచేత యుద్ధములో అర్జునుడు విజయమును సాధించటానికి ఉపాయమును నిర్దేశించమని కోరాడు.

అందులకు శంకరుడు "సర్వజ్ఞులైన మీరు, అలాంటి వరమును ఎలా ప్రసాదించారు?" అని శ్రీకృష్ణుని ప్రశ్నించాడు. అందులకు శ్రీకృష్ణుడు "మదన మంజరి భక్తికి ముగ్ధులై, మీరు హుటాహుటిన ఆ రాత్రి కైలాసమునకు వెళ్ళినట్లు, నేను కూడ ముగ్ధుడనై వరమును ప్రసాదించాను" అన్నాడు.

అప్పుడు పరమశివుడు నెమ్మదిగా ఇలా పలికాడు "ప్రవీరుని తల్లి జున్వాదేవి గంగాభవానిని తన ఆరాధనతో మెప్పించింది. నాకిప్పుడో గడ్డు సమస్య ఎదురైంది. గంగామాత నన్ను ప్రవీరుని పక్షాన ఉండి త్రిశూలముతో అర్జునుని పరాజితుణ్ణి చేయమని వేడుకొంటున్నది. మీరేమో అర్జునునకు

విజయమును ప్రసాదించమంటున్నారు. అందువల్ల నేను యుద్ధ రంగములో ప్రవేశించి, ఎవరి పక్షాన పోరాడను'' అన్నాడు.

అప్పుడు కృష్ణ పరమాత్మ నిరాశతో "అర్జునా నేను చేసిన చివరి ప్రయత్నము కూడ ఫలించ లేదు. పరమశివుడు సూటిగా సమాధానము చెప్పాడు. ఇప్పుడేమి చేయాలి?'' అన్నాడు. అందులకు అర్జునుడు "ప్రభూ, మీరేం చేస్తారో నాకు తెలియదు, కాని మీరేమి చేసినా, నా మంచికేనని ప్రగాఢ విశ్వాసమున్నది. రణరంగమును ప్రవేశించే సమయము సమీపిస్తున్నది'' అన్నాడు.

అప్పుడు కృష్ణభగవానుడు ఒకించుక యోచించి, అర్జునుని తోడ్కొని జగన్మాత ఉమాదేవి వద్దకు వెళ్ళాడు. ఆమెతో అశ్వమేధ యాగమును గురించి, ప్రవీరుడు అర్జునుని ప్రతిఘటించటము, తాను మదన మంజరికి ప్రసాదించిన రెండు ఆయుధములను గురించి, అవి చెంత నుంటే, ప్రవీరుని ఎవ్వరూ జయింపలేరని వివరముగ చెప్పి, జగన్మాత సహాయమునర్థించారు. అందులకు జగన్మాత అంగీకరించి తాను విశ్వమోహిని రూపం దాల్చి, తన మోహన రూపముతో ప్రవీరుని భ్రమింప చేసి, నిరాయుధుణ్ణి చేస్తానని వాగ్దానం చేసింది. అప్పుడు సంతృప్తులై, కృష్ణార్జునులు తిరిగి వచ్చారు.

రణరంగమున ప్రవేశించగానే, అర్జునుడు పెద్ద సైన్యముతో, తన కోసమై నిరీక్షిస్తున్న ప్రత్యర్థి ప్రవీరుని చూచాడు. యుద్ధము ప్రారంభించే ముందు ప్రవీరుడు ఆకాశము వంక చూడగానే దివ్య సౌందర్యముతో, అపూర్వమైన ఆకర్షణతో విరాజిల్లే ముగ్ధమోహన వదనారవిందము కాన వచ్చింది. అంతట అమోఘమైన సౌందర్యముగల యువతిని తానెన్నడూ చూడలేదు. ఊహాతీతమైన సౌందర్యము. మాయా ప్రభావముతో ఆ సౌందర్యమునకు అప్రతిభుడైన ప్రవీరుడికి, ఆమెను పొందాలనే క్షణికోద్రేకము కలిగింది. మాయ ప్రభావమంతటి మహత్తరమైనది.

ఆ ముగ్ధ మోహన రూపంతో జగన్మాత ఇలా పలికింది "యుద్ధ భూమిలో ప్రేమ ప్రేలాపన కర్థంలేదు. నీవు నిజంగా నన్ను కోరుకుంటే, కౌమోదకిని, సుదర్శన చక్రమును విసిరివేయ మన్నది. మాయా ప్రభావమునకు దాసోహమన్న ప్రవీరుడు శ్రీకృష్ణ ప్రభువు ప్రసాదించిన ఆయుధ ద్వయమును విసిరివేశాడు. వెంటనే జగన్మాత ఉమాదేవి భువికి దిగి వచ్చింది.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

14శ్లో॥ మాధుర్య వారిధిమదాన్ధ తరంగభంగీ
శృంగార సంకలిత శీత కిశోరవేషమ్,
ఆమన్దహాస లలితానన చన్ద్రబిమ్బ
మానన్ద సంప్లవ మనుప్లవతాం మనోమే ॥

"శ్రీకృష్ణులవారి పుట్టినరోజు పండగటమ్మా యీవేళ యశోదమ్మగారు అందరినీ సాయంత్రం వారింటికి పేరంటానికి రమ్మని చెప్పమన్నారు." ఇంటింటికీ వెళ్లి పిలుస్తున్నది యశోదమ్మగారి పరిచారిక. ఆదోవనే వస్తున్న ఒక ముసలి అవ్వ ఆగి ఆ మాటలు విన్నది. ఆమె గుండెల్లో ఆనందం పొంగివచ్చింది. ఏమి అదృష్టం అనుకున్నది. దారిన నడుచుకుంటూ వచ్చిన ఆయాసం ఇంకా తగ్గలేదు అవ్వకి. ఒకింటి దగ్గిరాగి దాహమడిగితే కమ్మని మజ్జిగ యిచ్చారు. అది తాగాక కడుపు చల్లబడింది. దాపునే ఉన్న రావిచెట్టు దగ్గిరకి పోయి చుట్టూ ఉన్న తిన్నెమీద కూచుంది. పరిసరాలన్నీ కొత్తగా ఉన్నాయి. ఊరికి కొత్తమొహంగా తోచిన ఆమెను ఒకరిద్దరు 'ఏ ఊరమ్మా?" అని అడిగారు. "మునిపల్లె" అనే ఆమె సమాధానం విని ఆ ఊరు ఎరిగినవారైతే నాలుగు మాటలు మాట్లాడారు. తెలియనివారు 'ఓహో' అనుకుంటూ సాగిపోయారు. అవ్వకు గతజీవితమంతా కళ్లముందాడింది.

ఆమె పేరు రాగమ్మ. కొంత వయస్సు వచ్చేసరికి వెనకాముందూ ఎవరూ లేని ఒంటరిదైపోయింది. ఇరుగుపొరుగులామెను ఆదరిస్తూ వచ్చారు. అందుకు ప్రతిఫలంగా ఓపిక ఉన్నంతవరకూ వంచిన నడుం ఎత్తకుండా వారికి సాయం చేస్తూ వచ్చింది. కాలమూ, బలమూ చాకిరీలో కరిగిపోయాయి. జవసత్త్వాలు ఉడిగిపోయాయి. రాగమ్మ ఇప్పుడు తనముందు గతేమిటనే ఆలోచనలో పడింది. ఆ గ్రామానికి అప్పుడప్పుడు వచ్చిపోతుండే చదువుకున్న అయ్యవారొకరు పురాణం చెప్తుంటే అక్కడికి వెళ్లి కూచుంటూ తన ధ్యాస అటు మళ్లించింది. అంతలో ఆమె సంస్కారం మేలుకొన్నందున మనస్సు వైరాగ్యాన్ని వరించింది. దేహాన్ని వంచేస్తున్న మోహమనే గుదిబండను వదిలించుకోవాలని, అందుకు సాయపడగల సమర్థుడైన వాని అండను చేరాలని ఆరాటపడింది. ఎవరా సమర్థుడు? అని ఆలోచిస్తున్న అవ్వకు అదే సమయాన పల్లెపల్లెలో వ్యాపిస్తున్న పసిబాలుని లీలలు, మహిమలు చెవిన బడుతూ వచ్చాయి.

రాగమ్మకు దారిదొరికినట్లయింది. గడిచిన కాలమంతా వమ్మయిపోయినా ఇకముందు బ్రతుకును సొమ్ముచేసుకోవాలనుకుంది. ఊరి ఎల్లలు దాటింది. చేరదలచిన చోటుకి వచ్చింది. ఇంక తన పంట పండినట్లే అనుకుంది సంబరంగా.

అయితే నిరుపేద అయిన తాను పల్లెకు రారాజైనవాని పిల్లవాడినెలా చూడగలనని ఆవేదన పడుతుంటే ఆడబోయిన తీర్థమెదురైనట్లు వాని పుట్టినరోజంటూ, అందర్నీ రమ్మంటూ పిలుస్తున్న వైనం చూసి ఉబ్బితబ్బిబ్బైంది, అందరితో కలిసి తాను వెళ్లగల గొప్ప అవకాశం వచ్చింది తనకిలాగ అనుకుంటూ.

తన చేరువలో నిలిచి నలుగురాడవాళ్లు మాట్లాడుకుంటున్న మాటలు వింటూ అవ్వ ప్రస్తుతానికి వచ్చింది. పుట్టినరోజు పెళ్లికొడుక్కి ఏం కానుకలు తీసుకెళ్ళాలా అని ఆలోచిస్తున్నారు వాళ్ళు. ఒకామె 'వెండిగిన్నెలో వెన్నముద్ద' అంది. మరొకామె 'పైడిగిన్నెలో పెరుగుబువ్వ' అంది. వేరొకామె 'తమ యింట పూచిన సన్నజాజుల మాల' అంది. 'మా యింట కస్తూరి ఉంది అది తీసుకెడితే సరి' అంది ఇంకొకామె. తనదగ్గిరేముంది?

సాయంత్రమైంది. నీరెండ వీధులవెంట గీతల్లాగ పాకుతోంది. గుంపులు గుంపులుగా అందరూ వెడుతున్నారు యశోదమ్మగారింటికి. వాళ్ల వెనకే నడిచింది అవ్వ. ఎవరైనా ఆమెని చూసినా పట్టించుకోలేరు. ఎందుకంటే అందరి ఆలోచనలు నందబాలునిపైనే ఉన్నందున. నందునిలోగిలి ముందాగారు అందరూ. భవనమంతా అలంకారాలతో మెరిసిపోతోంది. అగరు ధూపాల పరిమళాలు గుప్పుమంటూ అంతటా వ్యాపిస్తున్నాయి. కనుచీకటి పడేవేళకి ఇల్లంతా వెలిగించిన రత్నదీపాలతో నిండిపోయింది.

గలగలమనే గాజులమోతతో కిలకిల నవ్వులతో కలకల్లాడే జనమంతా లోనికి వెడుతున్నారు. అవ్వ ముంగిట్లోనే ఆగిపోయింది. లోపల దృశ్యమంతా కనబడేచోట ఒకమూల ముడుచుకుని కూర్చుంది.

-సశేషం

# మౌనధ్యాన సప్తాహశిబిరం

(గతసంచిక తరువాయి) - రమణ ప్రసాద్

బెంగుళూరులో ఉన్నటువంటి అవేవో పెద్ద పెద్ద పూలు, గార్బేలా పూలు, అటువంటి పూలు తీసుకొని రావాలన్నా, ఈ మానవుడు ఎక్కడెక్కడికో వెళ్ళి, ఏమేమిటో చేసి, అష్టకష్టాలు పడి, కొండలు తిరుగుతున్నాడు, కోనలు తిరుగుతున్నాడు, సాగరాలు తిరుగుతున్నాడు, చెరువులు తిరుగుతున్నాడు, అన్నీ పూలు తీసికొనివచ్చి ఏదో పూజ చేయాలనుకుంటున్నాడు. "సమర్ప్య ఏకం చేతః సరసిజ ఉమానాధ భవతే" హే ఉమానాధా! భవతే - నీకు సమర్ప్యైకం చేతః చిత్తరువేటి ఒక్క పుష్పాన్ని నీకు అర్పించలేక ఇన్ని తిరుగుతున్నాడే, సుఖేన న అవస్థాతుం జనయున నజానాతి కిమహో, అయ్యయో! ఎంత పొరపాటు పడిపోతున్నాడు. నిజమైన సుఖాన్ని అనుభవించ లేకపోతున్నాడే, ఆ పుష్పాలన్నిటికంటె కూడ గొప్ప పుష్పాన్ని ఇక్కడ పెట్టుకొని, దీనిని ఇవ్వలేకపోతున్నాడు. ఎక్కడెక్కడికో వెళ్ళి పూలకోసం అలమటిస్తున్నాడు. బస్తాలు బస్తాలు తెస్తున్నాడు. నీకు లక్షపూజ అంటాడు. కోటిపూజ అంటాడు, సహస్రపూజ అంటాడు. అష్టోత్తర శతనామాలు అంటాడు. ఏమైనా చేస్తాడు మరి. అసలులేనిదాని కంటె గొప్పదిగాని, దానిలో పడిపొర్లమని చెప్పలా. ఎందుకంటే అందులోకి వెళ్ళిన తరువాత ఎవరికంటే ఎవరు గొప్పగా చేస్తారు? మొన్న తిన్న ప్రసాదం కంటే ఈ రోజు తిన్న ప్రసాదం బాగుంది అన్నామనుకోండి ఇంకోసారి తప్పకుండా ఇంకొక 'వెరైటీ' ప్రసాదం వచ్చేస్తుంది చూడండి. కావాలంటే చేయించుకోండి భక్తులు. ఇంకొకసారి పూజవాళ్ళు ఉన్నచోట, నిన్నకంటె మొన్నప్రసాదం బాగున్నది అన్నారనుకోండి, తప్పకుండా రేపు శ్రీరామనవమికి గొప్ప ప్రసాదం వచ్చేస్తుంది. ఈయనకూడ, ఈ ప్రసాద దేవుడు కూడ ఎటువంటి వాడంటే, నీవు ప్రసాద భక్తుడివి కదరా! నీకంతేలే. ఏం చేస్తాం మరి! అని ఎక్కడెక్కడివో తీసుకొచ్చి పెట్టిస్తాడు. ఇది కూడ పెద్దమాయ. ప్రసాదం ప్రసాదంగా తీసుకోమంటే అక్కడ వీడు, ఈ ముండాకొడుకు ఏం చేస్తున్నాడు, ఇందులో ఉన్నవాడు, మనసుగాడు చేరి, ప్రసాదం కదా ఎలాగైనా, అందులో! పరవాలేదులే, సుగర్ ఎంత ఉంటే ఏమిటి? చక్కర పొంగలి లాగించేయటమే. మరింత నెయ్యి వగైరా! ప్రసాదం అంటే ఇంత తిన్నా కూడ ప్రసాదమే. ఇంత తింటే రోగమేం రాదు. నువ్వు పదార్థాన్ని

చూసి, దాన్ని బాగా ఎక్కించావంటే, దాని గుణం మరి? నీవు పదార్థంగా చూశావు కనుక దాని గుణం ఎక్కడికి పోతుంది? అందుకనే గురుదేవుల సన్నిధిలో ఉంటేనే ధ్యానం ఎందుకు కుదురుతుంది అన్నారు? నీకక్కడ వస్తు భావన, పదార్థ భావన రహితమైతేనే గుణమనేటువంటిది నీకక్కడ రహితమౌతుంది, గురుదర్శనం అవుతుంది. ఇవన్నీ అపరాధాలే. తప్పు ఒప్పుకుంటున్నాము, తప్పు ఎక్కడ ఒప్పుకుంటున్నాము. ఒప్పుకుంటున్నాము ఇక్కడ.

**అపరాధములన్నీ మరచి ఆదరించవే మాతా ॥**

ఆ తల్లిది ఎంత ఉపకారమండీ. ఎంత ఉపకారమంటే అపకారికి కూడ ఉపకారం చేసే స్వభావం అక్కడ ఉన్నది. మనందరికి ఏమున్నది? ఉపకారికి ఉపకారం చేయటమే చాల కష్టం అయిపోతున్నది. ఇంకా అపకారికి కూడ ఉపకారం ఎక్కడ చేస్తాం మనం? ఉపకారికి ఉపకారం చెయ్యటమే చాల గొప్ప. అది చాలా కోణాల్లో చూడవలసి వస్తుంది. ఇక అపకారికి ఉపకారం చేస్తామా! ఆయన ఉత్తినే కూర్చున్నాడా? ఆ శతకంలో చెప్పాడు ఆ మహానుభావుడు, ఆ పెద్దాయన ఏం చెప్పాడు **"అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ!"** అన్నాడు. నెపమెన్నకుండా చేయాలట. అంత అపకారం చేశాడా వాడు! అయినా కూడ నేను ఇంత ఉపకారం చేశాను అని చెప్పుకుంటుంటాము మనం. అక్కడ నీవు అటువంటి పొరపాటు పడ్తావేమోననే, ఆ పెద్దాయన ఏం చెప్పాడక్కడ? నెపమెన్నక చేయువాడు అన్నాడు. వాడు అపకారం చేశాడని నీ మనసులో కూడ ఉండ కూడదు. నీ స్వభావమే ఉపకారమై ఉండాలి. అప్పుడే ధన్యుడు సుమతీ అన్నాడు.

అలాగే ఇక్కడ కూడ గురుదేవుడి దగ్గర ఏమనుకుంటున్నావు? అమ్మా! అపరాధములన్నీ మరచి ఆదరించవే మాతా! ఆదరించవే అంటే అబ్బ ఎంత బాగుంది అక్కడ. ఎంత ఆదరణ ఉంది అక్కడ. ఆ అమ్మ ఆదరించకపోతే మనం ఇలా ఉండగలుగుతామా? ఈ రోజు ఇలా బ్రతుక గలుగుతామా? ఎవరినివారు ప్రశ్న వేసుకోండి. మన కన్నతల్లి ఎప్పుడో వెళ్ళి పోయింది. ఎప్పుడో వదిలేసింది. నీ దిక్కున్నచోట చూసుకోమంది. మనకు ఏమన్నా వస్తే పట్టించుకుంటున్నారా? ఎవరన్నా మీద భారం వేసుకుంటున్నారా? ఒక మహానుభావుడు ఒక కథ చెప్పాడు.

-సశేషం

# మాతాజీ బోధామృతం

(గతసంచిక తరువాయి) - శివ ప్రసాద్

పిల్లవాడు అటు చూస్తుంటే తల్లి ఇటు లాక్కెళ్ళింది. కాని కొంచెం దూరం వెళ్ళగానే, రద్దీ బాగా ఎక్కువ అయింది. అప్పుడు తల్లి పిల్లవాడిని చంకనెత్తుకున్నది.

మనకు మానవ జన్మ లభించింది. మహాత్ముల సన్నిధికి చేరుకున్నాము. ప్రభూ! మీమాటే, నామాట, తప్పకుండా నాకు ఇదే కావాలి అని వెంట బడ్డాము. సరే నీవు చేసుకుంటానంటే, నేనెందుకు కాదనాలి? రా! అన్నారు. నీవు ఎప్పుడైతే ప్రసాదాన్ని ప్రసాదంగా తీసుకుంటావో, అప్పుడు ముక్తి అక్కడే ఉంది. కష్టాలు వస్తే చంకనెత్తుకున్నారు. ఏదన్నా త్రాగిస్తే బాగుణ్ణు, తినిపిస్తే బాగుణ్ణు అని తినిపించారు. జీవితం అయిపోతున్నదిరా! అని మన మనసుల్లో, మంచి మాటలను ప్రవేశపెడతారు. ఎవరి ఒళ్ళో పడుతుంది? వారు ఇవన్నీ ఎందుకు చేస్తున్నారు? వారి ఒళ్ళో ఏమైనా పడుతుందా?

మేము చిన్నప్పుడు, ఏకాదశి చేసేవాళ్ళము. వయస్సులో ఉన్నవాళ్ళకు ఉపవాసం ఏం కష్టం? కాని రాత్రికి జాగరణ చెయ్యాలి. జాగరణ అంటే ఇంట్లో ఏదైనా పాడుకుంటూ, నిద్రపోకుండా ఉండటం. భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ చేసే వాళ్ళం. మధ్యలో కునుకు వస్తే, మసకలో పడుతూ పుస్తకం చేతులో నుండి జారి పోయేది. ఏకాదశి వ్రతం చేసి, రాత్రి సెంకండ్ షో చూసి వస్తున్నారు, ఏ వెంకటేశ్వర వైభవం వంటిదో అంతే. కామేశ్వరి ఇదేదో బాగానే ఉందే, దేవుడి సినిమా చూడవచ్చు అని తనూ వచ్చింది.

తరువాత గురుదేవులు తిరుమలకు తీసికొని వెళ్ళారు. అప్పుడు నేను, సుశీల పెద్ద గాయకురాళ్ళం. స్వామివారు పాడమనగానే, అప్పుడే కొత్తగా వచ్చిన పాట, మధురా నగరి సమీపంలో అనే పాట పాడాము. పాపం ఈ పిచ్చి తండ్రి అల్ప సంతోషి. కాస్త ఒక్క అడుగు వేస్తే చాలు, పిల్లలు రూట్‌లో పడ్డారు అని ఆనందపడేవారు. మాతక్క కూడ వచ్చింది. మాతక్క అది కాదు బాబూ! ఏకాదశినాడు సెంకడ్ షోకి వెళ్ళండి బాబూ! అన్నది. నిన్ను ఏకాదశి ఎవరు చెయ్యమన్నారు? సెకండ్‌షోకు ఎవరు వెళ్ళమన్నారు? అన్నారు స్వామి.

అలా తీర్చి దిద్దవలసిన అవసరం ఆయనకు ఏమున్నది? ఒక శిల్పి రాతిలో ఒక రూపాన్ని చక్కగా మలుస్తాడు. ఆ సమయంలో ఎక్కడ ఎంత గట్టి దెబ్బ వెయ్యాలో, ఎంత చిన్న దెబ్బ వెయ్యాలో, అంత దెబ్బనే వేస్తాడు. ఆ దెబ్బలతో శిల్పి కష్టపడి ఆ రూపం తెస్తే, శిల్పం తయారవుతుంది. గురుదేవులు ప్రపంచం

అనే ప్రవాహంలో కొట్టుకొని పోతున్న సృష్టిని తరింప చేయటానికి ఎన్నో అవతారాలు ధరిస్తున్నారు. ఒకసారి గురుదేవులు ఏం సెకండ్‌షోకు నాకు తెలియకుండా వెళ్తావా? నాకు తెలియకుండా చెయ్యగలవా? అని మనస్సు మీద ముద్ర వేశారు. ఆ తరువాత నేను సినిమా చూడలేదు.

మన జీవితాలను తీర్చిదిద్దటానికి మహాత్ములకే చెల్లు. నాలుగు యాపిల్స్ (apples) ఇస్తే కూడ, మనకే తిరిగి ఇస్తున్నారు, ప్రసాదంగా చేసి. మనం ఇంకా శిలలుగానే ఉంటే ఏం లాభం? ఆ మహాత్ములలో ఏవి లేవో, అవి మనం కూడ మనలో లేకుండా చేసుకోవాలి. ఆయనలో ఏవి ఉన్నాయో, అవి నీలో కలిగించుకో. అప్పుడు ఆ మహాత్ములు పొందే ఆనందాన్ని నీవూ పొందగలుగుతావు. ఆయన మనను నడిపించటమే కాదు, ఎత్తుకున్నారు. అటువంటి గురుదేవులను గుర్తించటం సాధ్యం కాదు. మనకు అటువంటి గురుదేవుల అండన చేరే భాగ్యం కలిగింది. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఇప్పటికైనా మన ప్రవర్తన మార్చుకోవాలి. నాలుగు లడ్లు తింటేనే ముఖం మొత్తుతుంది. కొందరు, కోట్లు ఉన్నా తినలేరు. మరి జీవితానికి ఏది ఆధారమై ఉన్నది? ఏది ఎంత వరకు ఉండాలో అంతవరకే ఉండాలి. దేనికీ అంటకుండా, ఏదీ అంటుకోకుండా బయట పడాలి. దానిని సెల్ఫ్ రియలైజేషన్ (self realisation) అన్నారు. తనను తాను గుర్తించాలి. చేసే ప్రతి పనిలో అడ్డంకులు ఉంటాయి. మన నడత, దృష్టి , అన్నీ అర్థవంతంగా ఉండాలి. భగవంతుడికి ఇష్టమైన పనులే చేయాలి. నీవు ఆచరించేవన్నీ నిష్కామ బుద్ధితో ఆచరించు. అప్పుడు నీకర్మ కూడ ధర్మంగా మారుతుంది. భగవానుడు........

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ ॥**

అన్నాడు. అక్కడ ఇక బయటకు వెళ్ళవలసినదిగాని, తెలుసుకొనవలసిందిగాని ఏదీ లేదు. కనుక శరణాగతి పొందాలి. మనస్సులో అటువంటి భావం ఉండాలి. నేను, నాది అనే బుద్ధి లేకుండా చేసుకోవాలి. తత్వాన్ని గుర్తించాలి.

భగవంతుడు ఎటువంటి స్థితిలో ఉంటే, ఆ స్థితిలో జీవించాలి. తన భారం అంతా అర్జునుడు కృష్ణుడి మీద వేశాడు. మనం కూడ స్వామివారిని అలా ఆశ్రయిస్తే, తప్పకుండా ఆయన మన భారాన్ని స్వీకరిస్తాడు. కాని మనం ముందు మన మనస్సును తెల్లకాగితం చేసుకోవాలి. దాని మీద మరకలు, బొమ్మలు ఉంటే ఎలా? భగవద్భావన ఉండాలి. భగవంతుడి సేవ చేసుకోవాలి. *

# ఆశ్వయుజ పూర్ణిమ

"ఏషణం ఇట్ యాత్రా సాస్మిన్నితి ఇషః విజిగీషాయాః కాలత్వాత్ " అని అమరము. 'ఇట్' అనగా యాత్ర. " శత్రువులు గెలవ తీచ్ఛియించిన వారికి యాత్ర దీనియందు గలుగుచున్నది. గనుక దీనిని ఆశ్వయుజ మందురు'' అని అమరము వివరిస్తున్నది. రాజులు, సార్వభౌములు యుద్ధములకై వెడలుటకు ఆశ్వయుజము అనుకూలమైన మాసము కావచ్చును. కాని ధర్మసంస్థాపనార్థము అధర్మముపై యుద్ధము ప్రకటించుటకై యాత్రకు బయలుదేరు పరమేశ్వరి అవతరణమునకు కూడ ఆశ్వయుజ మాసమనుకూలమై యుండ వలెను. అందుకే నవరాత్రులపైన విజయదశమి వచ్చుట సంభవించినదేమో.

ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా లోకే ధర్మిష్ఠం ప్రజాఉపసర్పన్తి
ధర్మేణ పాపమనుదతి ధర్మే సర్వం ప్రతిష్ఠితం
ధర్మసార మిదం జగత్
తస్మాద్ధర్మం పరమం వదన్తి

మొదలైన వాక్యముల వలన ప్రపంచమునకు ధర్మమే ఆధారమని తెలుచున్నది. ఆ ధర్మమునకు హాని కలుగనీయరాదు. అందుకనియే తన అవతార తత్త్వమును జెప్పుచు "ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే" అని వివరించినాడు భగవంతుడు. అసలు భగవంతుడేల అవతరించవలెను? ఈ ప్రశ్నకు సమాధానము కలుగొనవలసి యున్నది.

మన బిందె యొకటి బావిలో పడినదనుకొందుము. అప్పుడొక గాలమును తెచ్చి దానిని పైకి తీయుటకు ప్రయత్నింతుము. ఆ గాలమునకు ఒకదాని వెంట మరియొకటిగా అనేక బంకలు తగిలించి బిగింపబడి యుండును. ఆ బంకలలో ఏ యొక్కదానికి తగులుకొన్నను బిందెను పైకి లాగవచ్చును. కాని ఆ బిందె బోర్లపడి యున్నచో గాలము ద్వార మనమెంత ప్రయత్నము చేసినను లాభము లేదు. అప్పుడు స్వయముగ మనమే బావిలోనికి దిగి బిందెను తీయవలెను.

సంసారమను కూపములో పడిన మానవుడను బిందెనుద్ధరించుటకు తొలుత భగవంతుడొక గొప్ప పదునెనిమిది బంకెలు గల గాలమును దింప

ప్రయత్నించినాడు. ఆ గాలము ఓంకారము (ప్రణవము) ఆ తరువాత దానికి తగిలించిన నాలుగు వేదములు నాలుగు బంకెలు. ఆ తరువాత దానికి తగిలించిన 6 వేదాంగములు, 4 వేదోపాంగములు, 4 ఉపవేదములు అను పదునెనిమిది బంకెలు గల గాలముతోను బోర్లపడిన బిందెవంటి మానవుని ఉద్ధరింప ప్రయత్నించి ప్రయత్నించి లాభములేదని చివరకు తానే దిగివచ్చినాడు. ఈ దిగివచ్చుటనే 'అవతారము' అనుచున్నాము.

అవతారములనేక విధములని శాస్త్రములు చెప్పుచున్నవి. వానిలో మహాత్ములైన గురుస్వరూపులవతరించు కపిలాది బోధావతారములను 'కలావతారములు' అందురు. అమ్మవారి అవతారముల గురించి చెప్పుచూ దేవీభాగవతమున విష్ణువు "అంతర్యామి స్వరూపాసా సర్వకారణ కారణా" అన్నాడు. అనగా అమ్మను అంతర్యామిగా, సర్వకారణములకు కారణముగ గ్రహింపుమని విష్ణువు దేవతలకు చేసిన ఉద్బోధ.

శ్రీ చంద్రకాళీప్రసాద మాతాజీవారి అవతరణ దినము ఆశ్వయుజ పూర్ణిమ. ఆమె యవతరణమునకై శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ ప్రసాద బాబూజీ మహరాజ్ వారెట్టి గట్టి ప్రయత్నము చేసి యవతరింపజేసినారో శ్రీబాబూజీ చరిత్రకారులు "శ్రీ చిరంజీవిరాజుగారితో శ్రీబాబు" అను అధ్యాయమున వివరించిరి. శ్రీమాతాజీవారి నామౌచిత్యమును తెలియజేయుచు "చంద్రభాగా నదీ జ్ఞాపకార్థము 'చంద్ర' అనీ, నాయనమ్మ శేషమాంబగారి పేరు కలియుటకై 'శేష' అనీ, జగన్మాత స్మరణకు వచ్చుటకై 'అంబ' అనీ మొత్తము 'చంద్రశేషమాంబ' అను నామకరణము చేయబడినదని" వివరించిరి.

శ్రీ విద్యాతంత్ర , సమయమత, గౌడపాద కృత 'సుభగోద స్థుతి' మదలైన జగన్మాతను గూర్చిన తంత్ర, తత్వ, మంత్ర సాస్త్ర గ్రంధములలో శ్రీతాజీవారి నామమునకు వేరొక విశేషమైన యర్థము సూచింప బడినది.

అతోz స్యాః సంసిద్ధౌ సుభగ సుభగా ఖ్యా గురుకృపా
కటాక్ష వ్యాసంగా త్స్రవదమృత నిష్యంద సులభా!
తయావిద్ధో యోగీ విచరతి నిశాయామపి దివా
దివా భానూ రాత్రౌ విధువివ కృతార్థీ కృతిమతిః
(గౌడపాద విరచిత సుభగోదయస్తుతిః - 51)

గౌడపాదులు తమ "సుభగోదయ స్తుతిః" లో సాధకుడు గురుకృపకు ఎలా పాత్రుడౌతాడో వివరిస్తారు. గురువిచ్చిన మంత్రాన్ని స్వీకరించి, జపించి,

కృతకృత్యుడైన శిష్యుడు ఆశ్వయుజ శుద్ధ నవమినాడు గురువుకు పాదాభి వందనం చెయ్యాలి. అప్పుడు గురువు తన చేతిని శిష్యుని తలపై ఉంచుతాడు. దీన్నే హస్తమస్తక సంయోగము అంటారు. దీనిని మహావేధ అని కూడా అంటారు. మహావేధ పూర్తి అయిన తరువాత భగవతి మణిపురంలోకి ప్రవేశిస్తుంది. అందువలనే తమ కృపవల్ల మహావేధ పూర్తిచేసుకొన్న శ్రీమాతాజీ వారికి "నవరాత్రి", "విజయదశమి" పర్వదినాలలో లోకోద్ధరణ చేసే అవకాశాన్ని కల్పించారేమో శ్రీబాబూజీ మహారాజ్‌వారు.

ధర్మాధ్యాః పూర్ణిమాంతాశ్చ కళాః పంచదశైవతు షోడశీకళ సచ్చిదానంద రూపిణియై యున్నది. సహస్రదళ పద్మము జ్యోత్స్నామయ లోకము. అది చంద్రమండలము. అందువల్లనే శ్రీబాబూజీ మొదటి పదునైదు చంద్రకళలను సాధించి శేషమైన షోడశీకళా సచ్చిదానంద రూపిణియై యున్నది. సహస్రదళ పద్మము జోత్స్నామయ లోకము. అది చంద్రమండలము. అందువలనే శ్రీబాబూజీ మొదటి పదునైదు చంద్రకళలను సాధించి, శేషమైన షోడశీకళగా గుర్తించి, ఆషోడశీతత్వము సచ్చిదానంద రూపమైన శక్తితత్వముగా గుర్తింపుమని ప్రపంచమునకు తెలుపుటకై శ్రీమాతాజీవారికి చంద్రశేషమాంబ (చంద్ర - 15 కళల రూపము, శేష - మిగిలిన 16వ కళ, షోడశి, అంబ - శక్తి తత్వము. అమావాస్య నుండి పూర్ణిమ వరకు కూడ 16 కళలుగా గుర్తించు నాచారమున్నది. అమావాస్య 'పూర్ణము' అనగా సున్న. పూర్ణమి 'సంపూర్ణము' కనుక ఈ రీతిగా కూడ 16 కళలు అని చెప్పవచ్చు.) అందువలననే భవానికి 'అమృత లహరీవైందవ కళామ్' అని శాస్త్రజ్ఞులు నివాళులందించి యుండవచ్చును.

అట్టి మహనీయ పావనమూర్తియైన శ్రీమాతాజీవారి 56వ, జన్మదిన సందర్భంగా వారికి భక్తజనులంతా జన్మదిన శుభాకాంక్షలందించెదరుగాక!

## టీ.వీలో శ్రీమాతాజీవారి కార్యక్రమాలు

**శ్రీ మాతాజీవారి కార్యక్రమములు ప్రతిరోజు భక్తి ఛానెల్‌లో ఉదయం 5 గం॥ నుండి మరియు టి.వీ -(1) ఛానెల్‌లో 5గం॥30ని॥ నుండిమరియు భక్తి ఛానెల్‌లో అదనంగా ప్రతి శుక్రవారం, శనివారం సాయంత్రం 5 గం॥నుండి ప్రసారమౌతున్నాయి. భక్తులు విని తరించ గలరు.**

# శుభాభినందన

కం॥ శివశక్త్యాత్మక వై భువి
నవతారము దాల్చినట్టి యాద్యవు బాబై
యవిభాజ్యమూర్తియై ఘన
నవౌ నీజననం బెరుంగ నవు నెవ్వరికిన్

-సౌందర్యలహరిలో శంకర భగవత్పాదులు శెలవిచ్చినట్లు అమ్మ శివశక్త్యాత్మక రూప. శివశక్తులు కాళిదాస వచన ప్రకారము వాగర్ధములవలె అవిభాజ్యము. అంటే శ్రీబాబు, శ్రీమాతాజీలు అభిన్నులు. దేవి గాయత్రి వచించు "ఆద్య" ఆ తల్లియే. అట్టి జనని పూజించు సారమ్యము కలవారెవరు?

తే.గీ॥ తన ప్రకాశ విమర్శవై కానుపించు
జగతిని చూపు తుదలను జననమందె
ననుచు సుతలెల్ల ఘోషింప, నాజ్యనీవు
మానవాకృతి దోచుట మాయయె కద!

శివాద్వైత తత్వ వివేచనలో శివుడు (సదాశివుడు) ప్రకాశం. అమ్మ విమర్శ ఈ జగత్తు "తదైక్షత బహుస్యాం ప్రజయా యేతి" అను వేదవచన ప్రకారం అమ్మ కనుచూపుల జనించినది. అట్టి "ఆద్యయు", "స్థితి సంహార కారిణి"యు అయిన తల్లి మానవాకృతిలో నవతరించుట ఆమె లీలా విలాసమే కదా!

సీ॥ పరిణామ రహితవై ప్రణవాక్షర విలక్ష
ణార్థమాత్రౌ, శబ్ద మందునే నిను?
నీవవిద్యవు నీవపరమాముక్త
హేతుభూతవు, సనాదనివియు,
సంసారబంధమ్ము, సర్వేశ్వరత్వమ్ము
నీ కతంమ్మున గల్గు, నిఖిలమాయ
వీవు, స్వాత్మవు దేవి, నీవె సావిత్రివి
జగముల గన్నట్టి జననివీవు

తే॥గీ॥ అట్టి నీవొకదినమున పుట్టినట్లు
వేడుకల్సేయు వేద్యులౌ విబుధవరుల

**చర్య జ్ఞానమ్మొ! మౌఢ్యమో! సత్యమేమొ!**
**చక్కగా దెల్పవే తల్లి చంద్రకాళి!**

అమ్మ "అర్ధమాత్రగా" ప్రసిద్ధ. అర్థమాత్రా స్థితా నిత్యా యానుచ్చార్యా విశేషతః" అంటుంది చండీసప్తశతి. అర్ధమాత్రా శబ్దాతీత. మరి అట్టి తల్లిని శబ్దములెట్లు వర్ణింపగలవు? ఆమెయే విద్య ; ఆమెయే అవిద్య. (నీవ + విద్యవు = నీవే విద్యవు. నీవే విద్యవు; నీవు+అవిద్యవు = నీవవిద్యవు. నీవవిద్యవు).

అమ్మ విషయమున అన్యవైరుధ్యములు సమన్వయమగును. ఆమెయే "సావిత్రి" అనగా "ఆద్య"యైన గాయత్రి. ఆమెయే అన్ని జగములకు జనని అందువలననే బ్రహ్మ ఆమెను స్తుతించుచూ "విశ్వేశ్వరీం, జగద్ధాత్రీం" అంటాడు. మాములు తల్లి ఒక బిడ్డను ఒక స్థలంలో ఒక్క కాలంలో కంటుంది. కాని అమ్మ దేశకాలాతీత. మరి జగత్తుకు జన్మనిచ్చిన తల్లి పుట్టినరోజు చేసికొనే "విబుధులు" (దేవతలు లేక పెద్దలు) తెలిగయగలవారా? చెప్పవమ్మా

"చంద్రకాళీ" చంద్రకము = నెమలికన్ను; అళి= తుమ్మెద; ఆళి= వరుస. చంద్రకాళి = చంద్రక + అళి లేదా చంద్రకాళి. నెమలికన్నులు తుమ్మెదలు నల్లని మాయకు సంకేతములు. చంద్రకాళి అనగా చంద్రునివలె చల్లని ఆహ్లాదమును కలిగించు కాళి అని కూడ అర్థమున్నది.

**తే॥గీ॥ అసువులుండిన, లేకున్న, అమ్మనిన్ను**
**వాక్సుమమ్ముల బూజింప వలతి ఎవడు?**
**మృతుడు నిను గూర్చి పల్కు సంగతియె లేదు**
**ప్రాణియూహల కందని భవ్యవువీవు**

దుర్గాసప్తశతిలో బ్రహ్మ అమ్మవారిని నుతిస్తూ "విష్ణుం శరీరగ్రహణ మహమీశాన ఏవచ కారితాస్తే యతోऽతస్త్వాం కః స్తోతుః శక్తిమాన్ భవేత్" అంటాడు.

మాటలలో మాత్రమే వ్యక్తం చేయగలిగిన జీవి వాక్కుకు, బుద్ధికి, మనస్సుకు అందనిదానివి. అందువలన శరీరగ్రహణం చేస్న నేనూ, విష్ణువూ, శివుడు నిన్ను నుతించలేము. ఇక మరణించిన వారు, ముక్తులూ, శరీరం లేనివారు నిన్ను నుతించలేరు. ఎలా చూచినా నువ్వు స్తుత్యతీతవు.

**చ॥ అయినను నీవు పుట్టిన మహాశ్వయుజ**
**ప్రజలెల్ల రాత్మనం**

**శయములువీడి, సద్గురు ప్రసాద స్వరూపము**
**గాదలంచి, ప్రే**
**మయము, సభాజనప్రకర మంజులభావము**
**గానుతించెదన్**

మహాశ్వయుజ యనగా ఆశ్వయుజ పూర్ణిమ. చంద్రకాళియైన షోడశి పుట్టినరోజు. ఆమె సద్గురు ప్రసాద స్వరూపము అనగా సద్గురువు ప్రసాదించిన దివ్యస్వరూపము.

ఆమె సద్గురు సద్గురుదేవులైన ప్రసాద స్వరూపము ప్రసాదబాబూజీ మహరాజ్‌వారి స్వరూపముగా తలచి, ప్రేమ రసార్ద్రమైన హృదయంలో యీ సభాజన మంగళ మంజులగీత రూపంగా శభాభినందనలు పలుకుతున్నాము. స్వీకరించు తల్లీ!

## శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు

10-11-10 నుండి 14-11-10 వరకు చిన మంగళాపురము, పాలకొండలో జరుగును.

22-12-10 నుండి 26-12-10 వరకు బెంగుళూరులో జరుగును.

28-12-10 నుండి 30-12-10 వరకు బొంబాయిలో జరుగును.

# శ్రీ బాబూజీ దివ్యవాణి

పున్నమి వెన్నెల సర్వజీవ కోటికి ఆనందదాయకమైనది. చీకటికి కాని, తాపానికి కాని ఆస్కారం లేదు. కాబట్టి వెన్నెల ఎంతో హాయి, ఆహ్లాదం కలిగిస్తుంది. కాగా, సంవత్సరంలో నాలుగు పౌర్ణమి తిథులు గొప్ప పర్వదినాలు. అవి గురుపూజకు ప్రత్యేకంగా నిర్దేశింప బడినవి కావడమే అందుకు కారణం.

తన పాదపద్మములను ఆశ్రయించిన భక్తులలో అజ్ఞానాంధకారాన్ని, తత్సంబంధమైన తాపాన్ని పోగొట్టి వారి హృదయాలలో పండు వెన్నెలవంటి జ్ఞాన జ్యోతిని వెలిగించడమే కదా సత్య గురువుల మహదాశయం! కాబట్టి జ్ఞాన భిక్షకోసం తపించే సాధకులకు ఈ పూజా మహోత్సవం ఒక మహదావకాశం.

అలాంటి పర్వదినాలలో కార్తీకపౌర్ణమి, ఒకటి. ఈ సందర్భంగా గత బుధవారం నాడు ప్రాతఃకాలంలో సమర్ధ సద్గురు శ్రీ హనుమత్కాళీ వర ప్రసాదబాబు నంబూరు ఆశ్రమంలో ఆది జగద్గురువులైన దక్షిణామూర్తి తత్వాన్ని గురించి భక్త జనుల హృదయాలను హత్తుకొనేటట్లు ఉత్తేజకరంగా ప్రవచించారు.

"దక్షిణామూర్తి ఆనంద తేజోరాశి. ఆయన కేవలం జ్ఞానమూర్తి. మూర్తీభవించిన పరబ్రహ్మతత్వం. ఆయన దర్శనం మహదానందదాయకం. ఆయన సమక్షంలో కొద్దిసేపు కూర్చుంటేనే చాలు. జిజ్ఞాసువుల సంశయాలన్నీ పటాపంచలు అవుతాయి. జ్ఞాననేత్రం విప్పారుతుంది.

కాలానికి, పరిణామానికి అతీతుడు కావడంవల్ల దక్షిణామూర్తి నిత్య యువ్వనుడు. నిత్య సత్యం ఏదో తెలుసుకొనగోరి ఆయనను ఆశ్రయించినవారు మాత్రం వయోవృద్ధులు. శంకర భగవత్పాదులవారు తన స్తోత్రంలో అభివర్ణించినట్లు ఇదొక చిత్రమైన విషయం. అంతకన్నా విచిత్రమైనది ఆయన బోధనా పద్ధతి. ఎందుకంటే, దక్షిణామూర్తి నోరు మెదపడు. పెదవులు కదల్చడు. ప్రశ్నలు లేవు - సమాధానాలు లేవు. అంతా మౌన బోధ. దక్షిణామూర్తి ముఖంలో గంభీరత, ప్రశాంతత, నిశ్చలత తొణికిసలాడుతుంటాయి. చిన్ముద్ర ఒక్కటే ఆయన బోధకు సాధనం.

ఈ దృశ్య జగత్తు అంతా మిధ్యయని, అశాశ్వతమైనదని, పరిణామానికి లోబడినదనీ, అటువంటి ఈలోక భ్రాంతికి మనస్సు మూలకారణమని గ్రహించి, సకల జీవకోటిలో, ప్రకృతి అంతటిలో అంతర్లీనంగా భాసించే చైతన్య శక్తి ఒక్కటి సత్యమైనదని, నిత్యమైనదని తెలుసుకొనడం ముక్తిమార్గం. ఈ అవగాహననే ఆదిశంకరుడు విశ్వాత్మతత్త్వంగా అభివర్ణించారు.

అట్టి పరమాత్మతత్త్వాన్ని ఆకళింపు చేసుకొన్న సాధకుడు మాయాశక్తి కల్పితమైన జాతి, కుల, మతవిభేదాలకు, దేశకాలాల అవధులకు అతీతుడు. ఒంటరిగా వెళ్ళుతున్నప్పుడు పెద్దపులి వంటి క్రూర మృగాలు ఎదురైనప్పటికీ బెదురులేక స్వామి రామతీర్థవలె నిబ్బరంగా ముందుకు సాగిపోగలుగుతాడు. తనలో, పెద్దపులిలో భాసించే పరమాత్మ వస్తువు ఒక్కటేనని, అందువల్ల క్రూరమృగం తనకెట్టి హాని చేయజాలదని గ్రహించడమే అందుకు కారణం.

ఇలాంటి తాత్విక వికాసానికి మూలాధారమైనది భారతీయ సనాతన విజ్ఞానం. సనాతనం అంటే ఛాందసత్వంకాదు. పరమసత్యాన్ని చాటి చెప్పేది ఈ విజ్ఞానం. సంకుచిత దృక్పథాలకు పూర్తిగా విరుద్ధం. ప్రేమను, సహనభావాన్ని ప్రబోధిస్తుంది అది. పర జనీనమైనది కూడా. పైగా కాలదోషం లేనిది. ప్రపంచంలో ప్రచారంలోకి వచ్చిన ఇతర మతాలకు మార్గ దర్శకమైనది.

వర్తమాన హైందవ సమాజంలోని దుర్లక్షణాలకు, వివక్షతలకు రోసినప్పటికీ, మహనీయుడైన డాక్టర్ అంబేద్కర్ విదేశాలు చూపిన ప్రలోభాలకు లోబడక మానవుని మహోన్నతుడుగా మలచ గలిగిన బౌద్ధాన్ని ఆశ్రయించడంలో మన సనాతన ధర్మం విశిష్ఠతను లోకానికి మరొకసారి చాటారు.

సుఖ శాంతులకు ప్రతి మానవుడు, ముఖ్యంగా ప్రతి భారతీయుడు సత్యం, దయ, ప్రేమ, సహనభావంతో కూడిన దృక్పధాన్ని అలవరచుకొని సత్యాన్వేషకులై పరమాత్మ తత్వాన్ని తెలుసు కొనేందుకు కృషి చేయాలని బాబూజీ ప్రబోధం.

*

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

అంతలో కొంతమంది మాణిక్యంగారి పరిచయస్థులు కూడా అరుగు మీదకి వచ్చి కూర్చున్నారు. వచ్చిన ప్రతివారూ ప్రశ్నలు అడుగుతుంటే, శ్రీ బాబు వారి సమస్యలకు నివారణోపాయాలను వివరిస్తున్నారు. జనం యింకా యింకా రావటం మొదలు పెట్టారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటేసరికి, శ్రీ బాబుకు భోజన వసతి ఏర్పాటు చేయవలెననే ఆలోచన వచ్చింది. "బాబూ! యీ ఊరి కరణంగారైన శ్రీ చాగంటి లింగమూర్తిగారు సద్బ్రాహ్మణులు. వారింట్లో తమకు భోజనం ఏర్పాటు చేయమంటారా?" అని అడిగారు సూర్యారావుగారు. శ్రీ బాబు



బదులు పలుక లేదు. "పోనీ, యిక్కడే శ్రీ కందర్ప పరశురామయ్యగారని సజ్జనులు, నిరంతరమూ సద్విచారణ చేసుకొనే వారు అయిన బ్రాహ్మణులు ఉన్నారు. వారింట్లో ఏర్పాటు చేస్తాము" అనగానే, శ్రీబాబు అంగీకరించారు. సూర్యారావుగారు పరశురామయ్యగారింటికి కబురు చేసి, శ్రీబాబుకు వారింటిలో భోజనానికి ఏర్పాటు చేయమని చెప్పారు. వచ్చిన వారందరితోనూ శ్రీ బాబు మాట్లాడటం పూర్తి అయ్యేసరికి సాయంత్రం ఆరు గంటలైంది. అప్పుడు పండుదొరగారు వెంటరాగా, శ్రీబాబు తమ దేవతార్చనతో పరశురామయ్యగారింటికి భోజనానికి వెళ్ళారు.

ఆ విధంగా యనమదుర్రు గ్రామానికి శ్రీబాబు మొదటిసారిగా రావటం, శ్రీపరశురామయ్యగారికి దర్శనమివ్వటం జరిగింది(1941). శ్రీ బాబుతో పరశురామయ్యగారి సాహచర్యమును గురించి మరొక అధ్యాయంలో తెలుసుకుందాము. *

## దిరుసుమర్రు

శ్రీ బాబు యనమదుర్రు వచ్చిన తొలి రోజులలోనే దిరుసుమర్రు గ్రామంలో కూడా భక్తులకు దర్శనమివ్వటం జరిగింది. దిరుసుమర్రు

యనమదుర్రుకు మూడు కి.మీ. దూరంలో ఉంది. పండిత శ్రీ కలిదిండి నరసింహరాజుగారు దిరుసుమర్రులో నివసిస్తూ ఉండేవారు. వారు మహాత్ములు, అమేయ సాధన సంపన్నులు. శ్రీ పరశురామయ్యగారికి అతి సన్నిహితులు. శ్రీ నరసింహరాజుగారి కుమారుడు నారాయణరాజుగారు, పరశురామయ్యగారి పెద్దల్లుడైన చల్లా కృష్ణమూర్తిగారు ఆప్త మిత్రులు.

కృష్ణమూర్తిగారు జగన్మాత భక్తులు. తీవ్ర సాధనలు చేసి, దర్శనములు కూడా పొందిన వారు. వారు మద్రాసులో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ఆఫీసులో సబ్ ఎడిటరుగా పని చేసేవారు. ఆ రోజులలో ఒకనాటి రాత్రి స్వప్నంలో ఆయనకు మహాత్ములొకరు దర్శనమిచ్చారు. వారెవరో కృష్ణమూర్తి గారికి తెలియదు. భగవద్దర్శనం పొందాలనే తపనతో కృష్ణమూర్తి గారు తమ ఉద్యోగానికి రాజీనామా చేసి, సకుటుంబంగా యనమదుర్రు వచ్చేశారు. అక్కడ వారు, పరశురామయ్య గారు ధ్యానం చేసుకునే "గంగరాజు పాక" ప్రక్కనే మరొక పాకలో ఉండేవారు.

ఒకనాటి తెల్లవారుఝామున, "నీవు తెల్లవారగానే, దిరుసుమర్రులోని కలిదిండి నారాయణ రాజుగారి యింటికి వెళ్ళు. అక్కడ మీ యిద్దరికీ దివ్య పురుషులొకరు దర్శనమిస్తారు. వారి దర్శనం మీ యిరువురి జీవితాలను ప్రభావితం చేస్తుంది" అని ఒక స్వప్న ప్రబోధం కలిగింది. అప్పటికి నారాయణరాజుగారెవరో కృష్ణమూర్తిగారికి తెలియదు.

తెల్లవారగానే కృష్ణమూర్తిగారు దిరుసుమర్రు వెళ్ళి, నారాయణ రాజుగారిని గురించి వాకబు చేసి, వారింటికి వెళ్ళి తమను పరిచయం చేసుకుని, వారితో తమకు కలిగిన స్వప్న ప్రబోధమును గురించి తెలిపారు. ఆశ్చర్యంతో తలమునకలైన నారాయణ రాజు గారు, తమకు కూడా అదే స్వప్న ప్రబోధం కలిగిందని, కృష్ణ మూర్తి గారి కోసమే ఎదురు చూస్తున్నానని చెప్పారు. ఈ సంఘటనతో వారివురు ఆత్మీయులైనారు. తమకు దర్శన భాగ్యం కలిగించ బోతున్న ఆ దివ్య పురుషులెవరో, వారెంత మహిమాన్వితులై ఉంటారో అని ఎంతో ఉత్కంఠతో వారి దర్శనం కోసమై నిరీక్షిస్తూ, వారివురూ ఉబుసుపోకకై భగవానుని సగుణ, నిర్గుణ తత్త్వమును గూర్చి విచారణ చేసుకుంటున్నారు.

ఆ సమయంలో, అత్యంత తేజోవంతమైన ముఖవర్చస్సుతోను, సూర్య చంద్రుల వలె మెరిసిపోతున్న నేత్ర ద్వయముతోను, ప్రశాంత రోచిస్సులను వెదజల్లే మధుర మందహాసముతోను, బాల భగవానుని వలె కనిపిస్తున్న

మహనీయులొకరు ఆ యింటి ముంగిట వచ్చి నిలుచున్నారు. వారిని చూడగానే కృష్ణమూర్తి గారికి, మద్రాసులో తమకు స్వప్న దర్శనమిచ్చిన మహాత్ములు వీరే అని తెలిసి, ఆనందంతో అవాక్కయ్యారు. నారాయణ రాజు గారికి ఆ వచ్చిన వారు అపరిచితులైనా, వారిని చూడగానే, తమకు దర్శనమివ్వ వచ్చిన దివ్య పురుషులు వారే అనే నిశ్చయ భావం కలిగింది. వారే శ్రీబాబు.

ఇద్దరూ అంజలిబద్ధులై వెళ్ళి వారికి నమస్కరించి, లోనికి తీసుకొని వచ్చి సుఖాసీనులను చేశారు. ఎలా మాట్లాడాలా అని తటపటాయిస్తూ , "బాబూ! తమరు...." అంటుంటే, శ్రీ బాబు "అవును, నేనే. బాబునే. మీరు ఎదురు చూస్తున్న వాడినే. అది సరేగాని, యిందాకటి నుంచి మీరిద్దరూభగవత్తత్త్వము సగుణమా, నిర్గుణమా అనే విషయాన్ని గురించి విచారణ చేస్తున్నట్లున్నారు?" అన్నారు. ఆశ్చర్యంతో వాళ్ళిద్దరూ "నిజమే బాబూ" అన్నారు. "మరి ఏదైనా సమాధానానికి వచ్చారా?" అని అడిగారు శ్రీబాబు. "రాలేకపోయాం బాబూ" అన్నారు వాళ్ళిద్దరు.

శ్రీ బాబు "మీరు సమాధానానికి రాలేకపోవడానికి కారణం సగుణ, నిర్గుణములు రెండూ వేరువేరని మీరు భావించటమే. నిజానికి అవి రెండు కావు. కరెంటు నిర్గుణము, బల్బు సగుణము. సగుణమైన బల్బు ప్రకాశించాలంటే, నిర్గుణమైన కరెంటు దానికి ఆధారము. కరెంటు ఉనికిని గుర్తించాలంటే బల్బు కావాలి. నామ రూప గుణములకు, దేశ కాల క్రియలకు అతీతమైన భగవత్తత్త్వము నిర్గుణము. ఆ భగవత్తత్త్వము యొక్క సగుణ ప్రకటనమే నామ, రూప, గుణ, దేశ, కాల, క్రియాదులతో కూడిన జగత్తుగా ప్రకాశిస్తున్నది. దీపం లేకుండా కాంతి రాదు. కాంతి లేనిదే దీపం ఉనికి తెలియదు. ఆ రెంటిని విడదీయగలమా? ఇంకా లోతుగా విచారిస్తే , దీపానికి, దీప కాంతికి కూడ సాక్షిగా, యీ విచారణ చేసే **'నేను'** ఉన్నది. 'నేను' ఉంటేనే కదా, సగుణ నిర్గుణములను గూర్చిన ప్రశ్న, దానికి జవాబు ఉన్నాయి! 'నేను' అంటేనే 'ఆత్మ' , లేక 'అహం'. దీనినే వేదాలు 'బ్రహ్మ' అన్నాయి. అది ఒక్కటే యేకైక నిత్య సత్యము. అది సగుణ నిర్గుణాతీతమైనది. అదే తానని, యీ నామ రూప క్రియాత్మకమైన దేహము తాను కానని మానవుడు గ్రహించినప్పుడు, 'ప్రశ్న' ఉండదు. 'జవాబూ' ఉండదు.

-సశేషం

# అమెరికాలో శ్రీ మాతాజీ

(ది. 3.7.10 క్యాలిఫోర్నియా, అమెరికాలో శ్రీ మాతాజీ వారి అనుగ్రహ భాషణ సంగ్రహరూపం)

-పద్మజ U.S.A

శ్రీమాతాజీ అమెరికాలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యంలో ఏ పనిచేయటానికైనా వెరవడు. బాల్యంలో ఏమి చేయలేని స్థితి కాబట్టి అగ్నిని కూడా తాకగలుగుతాడు. అక్కడ భయం లేదు. ఎందువలనంటే బాల్యంలో మనస్సు ఉన్నా అది అణిగి ఉన్న స్థితి. గాఢసుషుప్తిలో కూడా మనస్సు అణిగి ఉంటుంది. అలాగే ధ్యానంలో కూడా మనస్సు నిశ్చల స్థితిని పొందవచ్చు. అందువలన నిదురలోకాని, ధ్యానంలో కాని భయం లేదు. నిద్ర నుండి మెలకువ వచ్చినా ధ్యానం విరమించిన తరువాత తన చుట్టూ ఉన్న పరిసరాలను ఒకసారి వీక్షించి భయపడవచ్చు. గాఢనిదురలో తన ఒంటి మీద వస్త్రం తొలగినా, ఏమీ తెలియని స్థితి. నిదుర నుండి మెలకువ రాగానే సిగ్గుపడతారు. మనస్సును గుర్తించి, దానిని నియంత్రించి, దానిని అర్థం చేసికొని సరిగా ప్రవర్తిస్తే భయపడవలసిన పని ఏముంది? శాంతి చేకూరుతుంది.

మనం మనస్సు చుట్టూ తిరుగుతున్నామా? లేక మనస్సు మన చుట్టూ తిరుగుతోందా? ఆలోచించండి. మనమంతా మనస్సులోనే ఉన్నాము. కానీ మనస్సు జడం. మనస్సు ఎన్నడూ చెడ్డది కాదు. మనస్సు గురించి భయపడ వలసిన పని లేదు. మనస్సుకు రుచిలేదు. మనస్సుని మనం పోషించటంలో ఉంటుంది. మనస్సు ఊసరవెల్లిలాగా పరిసరాలను బట్టి మార్పు చెందుతుంది. సంఘాన్ని బట్టి మార్పు చెందుతుంది. ఆవకాయలో వేసిన శనగగింజకి, వేపరసంలో వేసిన శనగ గింజకి తేడా ఉంటునిది కదా! సత్సంగంలో సత్యవస్తువుతోనే ఉంటుంది. దుస్సంగంలో వినకూడని మాటలు శ్రవణం చేస్తోంది. పలకరాని మాటలు పలుకుతోంది. చేయకూడని పనులు చేస్తోంది. కర్మని మూటకట్టుకుంటోంది. మరొక జన్మకి బంధింతమవుతోంది. దీనికి కారణం ఎవరు? గురుస్మరణ మరువన్నంత వరకు మనస్సు ఎంత సంకల్పించినా, ఎన్ని విధాల సంకల్పించినా చింతలేదు. పూర్వజన్మ వాసన ద్వారా కలిగిన ఏదైనా సంకల్పాన్ని వదిలించుకొని బయటపడటం ముఖ్యం. అది సాధకుణ్ణి పురోగతికి తీసికొని వెడుతుంది. మనస్సుకి బంధింపబడకుండా చూసుకోవాలి.

మనుస్స చేసే దోషాన్ని మనస్సు చేతనే మాటిమాటికి చూపించటమే సాధన. విచారణ చేయాలి. మనస్సు యొక్క దోషాలను మనస్సు చేతనే గుర్తింప చేయాలి. అప్పుడు మనస్సు నిర్మలమై, శుద్ధమై భగవంతునికి సమీపం అవుతుంది. ప్రశాంతమైన చెరువులో ఒక రాయి వేస్తే నీటి ప్రశాంతతకి భంగం కలిగి కదలికలు వస్తాయి. మనస్సు కూడా అంతే. మనల్ని ఉద్ధరించేవాడు భగవానుడు. మనం ఎలా పిలిచినా పలుకుతాడు. వినకూడని మాటల వలననే మనస్సులో ఆవేదన కులగుతోంది. మహాత్ముల వాక్కు ద్వారా వచ్చే బోధని శ్రవణం చేసి ఆచరణలో పెట్టాలి. బాల్యంలో మన ఫొటోకి, ఈరోజున మనకి చాలా తేడా ఉంది. పంచభూతాత్మకమైన దేహం పరిణామంతో కూడినది. ప్రపంచంలో అనేక పనులకి ఈ దేహాన్ని ఉపయోగిస్తున్నాము. అసలు ఈ దేహం ఎందుకు పొందామో తెలుసుకోవటం లేదు. దేహం అనాత్మ. మార్పు చెందేది. కాని దానిని ప్రకాశింపజేసే ఆత్మ మారనిది. ఆత్మవెళ్ళిన దేహం ప్రేతే కదా!

సత్సంగం అంటే పదిమంది ఉండనవసరం లేదు. నీలో ఉన్న సత్య వస్తువును గుర్తించటమే సత్సంగం. శంకర భగవత్పాదులవారు మనస్సుని కోతితో పోల్చారు. కోతి ఈ చెట్టు మీద నుంచి ఆ చెట్టుకి, ఆ చెట్టు మీద నుంచి ఈ చెట్టుకి దూకుతుంది. దానిని స్వైరవిహారం అంటాం. మనస్సనే కోతిని భక్తిపాశాలతో బంధించి నీ దగ్గర ఉంచుకోవయ్యా! అని ఈశ్వరుణ్ణి కోరారు. మనస్సుని లక్ష్యం మీదనే ఉంచాలి. అదే ధ్యానం. నీవు వేసే ప్రతి అడుగులో, మాటలో ధ్యానం ఉంది. ధ్యానం అంటే బుద్ధి యొక్క మార్గము. మనస్సు అనే కోతి మోహం చేత ప్రకృతివైపు పరుగు పెడుతోంది. మనస్సు బాగుందన్నా, బాగాలేదన్నా దాన్ని ఎవరైనా చూపించగలరా? చూడగలవా? గుర్తించగలవా? మనస్సు మాయకి పుట్టిల్లు. మనస్సులో ఈర్ష్య, అసూయలతో కూడిన భావనలే ప్రశాంతతని భంగపరుస్తున్నాయి. మాయ ఎక్కడ నుండి వచ్చింది? గీతాచార్యుడు స్పష్టంగా ఈ విషయాన్ని వివరించాడు.

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా** మాయ నాద్వారానే వచ్చింది. దానిని జయించాలంటే నా దయ కావలసినదే అని అర్జునునకు బోధించాడు. *

# మన సాధన ఎందుకు ఫలించటం లేదు?

మోక్షమును పొందవలెనని కోరువాడు ముముక్షువు. బ్రహ్మమును తెలుసుకొన వలెనని జిజ్ఞాస (కోరిక లేక ఇచ్ఛ) గలవాడు బ్రహ్మజిజ్ఞాసువు వీరిద్దరకూ పేర్లలో భేదమున్ననూ లక్ష్యమొక్కటే. నరక ద్వారములైన కామక్రోధాది శత్రువర్గము జయించినగాని మోక్షప్రాప్తి కలుగదని శాస్త్రము ఘంటాపదముగా చెబుతూ ఉన్నది.

అటువంటి సందర్భంలో త్రాగటం, పరాంగనా సంగమానికి పాల్పడటం వంటి పాపకర్మలకు దూరంగా ఉండాలని వేరే చెప్పనక్కర్లేదు కదా! అలాగే, మరికొన్ని దుర్లక్షణాలకు దూరంగా ఉండాలని శాస్త్రం చెబుతున్నది. అలా దూరంగా ఉంటేకాని మోక్షప్రాప్తికి అవకాశం లేదు.

అలా దూరంగా ఉంచవలసిన దుర్లక్షణములు ముఖ్యంగా మూడు. ఆభిజాత్యము, విద్యామదము, ధనమదము అనేవి పాపకర్మలు కాకపోయినా, పాపకర్మను చేయిస్తాయి. కనుక ఇవి పరిహరింపదగినవి. వీటిని కులగర్వము, విద్యాగర్వము, ధనగర్వము అని కొన్ని గ్రంథాలు నిరశిస్తే, ప్రపన్నామృతాది గ్రంథములు వీటిని మదత్రయంగా వ్యవహరిస్తాయి.

**విద్యామదో ధనమదః తృతీయాభి జనోమదః**
**ఏతే మదావలిప్తానాం ఏతేవ శతాం దమాః**

(ప్రపన్నామృతం : 22- 19)

**ఆభిజాత్యమదం**

గొప్పకులంలో పుట్టాననే మదం లేదా గర్వంతో తక్కువ కులంలో పుట్టిన వారిని చిన్నచూపు చూడటం అనేది ఆభిజాత్యమదం. వేదాంత పంచదశలో దీనికి సంబంధించిన ఒక చక్కని కథను శ్రీవిద్యారణ్యులు తెలియజేస్తారు.

ఒక విద్వాంసుడైన బ్రాహ్మణునకు దేవతల వద్ద నుండి అమృతము పొందవలెనని కోరిక కలిగెను. అతను చాలా కాలము ఇంద్రునిగూర్చి తపస్సు చేసెను. అతని తపస్సునకు ఇంద్రునకు ప్రత్యక్షము కావలసి వచ్చెను. ఇంద్రుడు బ్రాహ్మణుని "నీకేమి కావలె"నని అడిగెను. బ్రాహ్మణుడు దానికి "నాకు అమృతము కావలె"నని చెప్పెను. ఇంద్రుడు "అమృతము దేవతలకు తప్ప

అన్యులకు ఇవ్వరా''దనియు "వేరేమేనైననూ కోరుకొను''మనియు చెప్పెను. "నాకు వేరేమియూ అవతరం లే''దని బ్రాహ్మణుడు మొండికేసెను. చేయునది ఏమియూ లేక ఇంద్రుడు వెడలిపోయెను.

బ్రాహ్మణునకు పట్టుదల హెచ్చెను. అప్పుడు విష్ణువును గూర్చి కఠోరమైన తపము చేయుట మొదలు పెట్టెను. కొంతకాలమునకు విష్ణువు ప్రత్యక్షమై "రేమి కావలెనో కోరుకొనుమ"నెను. దానికి బ్రాహ్మణుడు "నాకు ఇంద్రుని వద్ద నుండి అమృతము ఇప్పింపుమ''నెను. "నీవు కోరినట్లే నీకు ఇంద్రుడు అమృతమునిచ్చును. నీవు కాదనక స్వీకరింపు''మని వరమిచ్చి అదృశ్యుడయ్యెను.

త్వరలోనే ఇంద్రుడాతనికి చండాలవేషములో ప్రత్యక్షమై చమటలు కారుతున్న శరీరముతో బొడ్డుక్రింద వ్రేలాడుకట్టుకున్న అమృతకలశమును చూపి "ఇదియే అమృత కలశము తీసికొని త్రాగుము'' అనెను. బ్రాహ్మణునకు ఆ చండాలుని ఆకారము చూసి అసహ్యము కలిగెను. " ఛీ! ఇంతవాడనైయుండి ఈ ఛండాలుని కడ నుండియా అమృతమును గొనుట!'' అని "నాకు నీ అమృతము వలదు వెళ్ళిపొమ్ము!'' అనెను. ఇంద్రుడు సంతోషముతో వెడలిపోయెను. "నేను బ్రాహ్మణుడను. చిక్కువ కులమువాడను అను'' అభిజాత్యమదమే బ్రాహ్మణునకు అమృతప్రాప్తి కలుగకుండ చేసింది.

విద్యామదము

ఆభిజాత్యమదము తరువాత మానవుణ్ణి అణగద్రొక్కు రెండవ దుర్లక్షణము విద్యామదము. పద్మ పురాణమందు దీనికి సంబంధించిన ఒక కథ కలదు.

ఒకప్పుడు చతుర్ముఖ బ్రహ్మ ఒక గొప్ప యజ్ఞము తలపెట్టెను. ఆ యజ్ఞము నందు పాల్గొనుటకు విద్వాంసులైన బ్రాహ్మణులందరూ వచ్చి ఎవరికి వానికే "తనయంత విద్వాంసుడు ఇంకొకడు ప్రపంచమున లేడ''న్నంతగా గర్వినష్టులైనవారా బ్రాహ్మణులు. పరమశివునకు వారి గర్వమును చూసి జాలి కలిగి వారిని ఆ దోషము నుండి తప్పించుటకు పూనుకొనెను. మడి బట్టలను, పట్టుబట్టలను కూర్చున్న ఆ బ్రాహ్మణ బృందం మధ్యలో తాను పోయి కూర్చుండెను. దువ్వని, ముండనము చేయని తల, చేతిలో కపాలము, దుమ్ముకొట్టుకొనియున్న పాదములు, పులితోలు కట్టుపుట్టముగా ఉన్న పరమ శివుని రూపము వారికి అసహ్యము కలిగించినది.

-సశేషం




(గతసంచిక తరువాయి) -రమణ ప్రసాద్

శ్యమంతకం పునఃప్రాప్తి కాకపోతే ద్వారక భవిష్యత్తు తేజోవంతం అవదు.... ఈ వ్యధను మనస్సులో దాచుకునే కృష్ణుడు పైకి సంతోషంగా కనిపిస్తున్నాడు...

ఈనాడు బలరాముడు అన్నాడు... రేపు అందరూ అంటారు... శతధన్వుడు చేసిన దానిని అందరూ అనుకరించటం మొదలుపెడతారు... పరస్పర అవిశ్వాసం, ద్వేషం, అశ్రద్ధ చివరికి భయానకమైన అంతిమ ఘడియ.

యాదవులందరితో అక్రూరుడు కూడా జరిగినదానికి బాధపడుతున్నట్లుగా కనిపిస్తున్నాడు. తన మీద ఎవరికి సందేహం రాకుండా జాగ్రత్త పడుతున్నాడు. శ్యమంతకం ద్వారా ప్రాప్తించే స్వర్ణముద్రలు అతని భాండాగారాన్ని నింపుతున్నాయి.

ఈ అనంతమైన ధనాగారం వినాశనానికే దారి తీస్తుందన్న మాట అక్రూరునికి తెలుసు. తన పరలోక గమనం సుగమం అవటానికి అక్రూరుడు ధన భాండాగారాన్ని తెరిచాడు. ఆయన మహలులో యజ్ఞం జరిగింది. ఆ తరువాత ఒకటి తర్వాత ఒకటి మహా యజ్ఞాలు అవిరళంగా జరిగాయి. "స్వాహా.... ఘోషలు.... కాలువలై ప్రవహిస్తున్న ఘృతధారల సుగంధాలు ద్వారకలో వ్యాపించాయి. అక్రూరుని ఆవాసం కేవలం... కేవలం ద్వారకకే కాదు, సమగ్ర ప్రదేశానికి కేంద్రం అయింది. బ్రాహ్మణులు, ఋషులు, యాచకులతో నిండి పోయింది.

రోజులు, నెలలు, సంవత్సరాలు తరబడి యజ్ఞాలు జరుగుతున్నాయి - ఇది శ్రీ కృష్ణుని మేల్కొలిపినట్లైంది - అక్రూరుని కోశాగారంలో ఇంత ధనం ఎక్కడనుంచి వచ్చింది? సమస్త వృష్ణి వంశం ఖర్చు పెట్టలేనంత ధనం అక్రూరుడు ఒక్కడు ఎలా ఖర్చు పెడుతున్నాడు?...."

శ్యమంతకం తప్ప జగత్తులో ఏ శక్తీ ఇంత ధనాన్ని ఇవ్వలేదు. కృష్ణుడు అచ్చెరువొందాడు. ఆ తరువాత చేయాల్సినది నిశ్చయించుకొన్నాడు.

"అక్రూర మహాశయా" ఆ మరుసటి రోజున యాదవ సభలో ఆశీనుడై ఉన్న అక్రూరుని వైపు దృష్టి నిలిపి గంభీరంగా అన్నాడు - 'శ్యమంతకమణి..."

దాన పుణ్యాదుల వలన వికసించిన అక్రూరుని ముఖం ఒక్కసారిగా కాంతి విహీనమైంది. కృష్ణుని చిరునవ్వులో కరుణ తొణికిసలాడింది.

సత్రాజిత్తు శతధన్వుల నామాలు అతీతంలో కలసిపోయాయి. అక్రూరుడు అలా కాకూడదు... 'యాదవ సేనాని అక్రూరులు తపోనిష్ఠలో ఉన్నట్లున్నారు..." అన్నాడు కృష్ణుడు.

"కృష్ణా..." అక్రూరుడు ఎక్కువ మాట్లాడలేకపోయాడు.... అతని హృదయం ఘోషించింది.

'అవును మహాశయా!" మీరు శతధన్వులు కారు... మీరు భావి కాలానికి ద్రష్టలు. శ్యమంతకమణి భావి తరం వారిని కాటు వేయటానికి మీరు నిమిత్తులైతే అది కృష్ణునికి ఎంత వ్యథ కలిగిస్తుంది" అన్నాడు. కృష్ణుని స్వరం రుద్ధమైంది. అది సభనంతా విచలితం చేసింది....

"ఇహలోక యాత్రాంతంలో అక్రూరుల దైవ స్వరూపులుగా భాసిస్తారు" కృష్ణుడు ఇంకా ఇలా అన్నాడు. "ఈ జరిగిన పుణ్య కార్యక్రమాలు జరిపి మీరు ఇహలోకంలో ధన్యులుగా పరిగణింపబడే ఉద్దేశ్యంతోనే మీరు ఈ ధనాన్ని.....

"కృష్ణా... కృష్ణా" అక్రూరుడు ఆపైన మాట్లాడలేకపోయాడు... లేచి నుంచున్నాడు.

అతని మనస్సులో తుఫాను చెలరేగింది... కృష్ణుడు నిజమే చెప్తున్నాడు.... ఈ అసంఖ్యాకమైన యజ్ఞాల అంతిమ లక్ష్యం విశ్వాత్మతో తద్రూపం చెందటమే కదా!. ఆ తాదాత్మ్య స్థితి ముందు శ్యమంతకమణి ప్రాప్తి ఎంత....

ఎప్పుడూ తనతో ఉంచుకొనే మణిని అక్రూరుడు తీసి యాదవుల సమక్షంలో ఉంచాడు.... ఇంకేమీ మాట్లాడకుండా శిరస్సు వంచాడు. కనుల నుండి అశ్రుధారలు వర్షిస్తున్నాయి... కృష్ణుడు లేచి అక్రూరుని వద్దకు వెళ్ళి అతని వీపు మీద చేయి వేశాడు. యాదవ సభ స్తబ్ధమైంది.

మిథిలకు కోపగించుకొని వెళ్ళిన బలరాముని ద్వారకకు తీసుకు రమ్మని దూతలను పంపాడు కృష్ణుడు.

ద్వారకకు వస్తుంటే బలరామునిలో అనేక భావాలు చెలరేగాయి. అక్రూరునిపై చెప్పలేనంత కోపం వచ్చింది.... తను ఎంతో పశ్చాత్తాపంతో లజ్జితుడైనాడు.

"అన్నగారూ!" కృష్ణుడు బలరాముని చరణాలపై వ్రాలి ఇలా అన్నాడు "ద్వారక మీ రాకతో కోల్పోయిన ప్రకాశాన్ని తిరిగి పొందింది. నాకు ఎంతో ఆనందంగా ఉంది..."

"నీకు కళ్యాణమగుగాక!" అన్నాడు బలరాముడు ఎంతో సంకుచితుడై... కృష్ణుడు ఏమీ జరగనట్లుగా బలరామునికి తల్లిదండ్రులైన దేవకి వసుదేవుల కుశల వార్తను వినిపించాడు. సమగ్ర యాదవ పరివారం గురించి వివరించాడు.

ఆ మరుసటిరోజున యాదవ సభలో కృష్ణుడు శ్యమంతక మణిని అందరి సమక్షంలో ఉంచాడు. బలరాముని దృష్టి మణి మీద నిలిచింది. యాదవులందరి దృష్టి బలరాముని మీద నిలిచింది. కృష్ణుని దృష్టి యాదవ సభమీద నిలిచింది. మణిపైన ఆధిపత్యం పొందాలని బలరామునికి ఉన్నా, ప్రయత్న పూర్వకంగా సంయమనాన్ని పాటించాడు. యాదవుల దృష్టిలో విశేషించి కృష్ణుని దృష్టిలో అపరాధిగా నిలిచాడు.

"అన్నగారూ!" సవితా నారాయణుని కృపా ప్రసాదము నిజంగా అనుపమానమైనది" అన్నాడు కృష్ణుడు.

"అవును!... కాని ఈ కృపా ప్రసాదం వల్ల ఇంతవరకు సత్రాజిత్తు, శతధన్వుడు, అక్రూరుడు లాభం పొందారు! అన్నాడు బలరాముడు -మణి పొందాలనే లాలసను దాచుకోలేకపోతున్నాడు.

కృష్ణుడు ఒక్కసారి బలరాముని వైపు చూశాడు... అతని కళ్ళలో మెరుస్తున్న లాలసను గుర్తించాడు.

'అలా అనకండి అన్నయ్యా! అక్రూరుడు శ్యమంతకం ద్వారా పొందిన ధనాన్ని సమగ్ర సృష్టి కళ్యాణార్థం వినియోగించాడు. యజ్ఞం వల్ల సృష్టికి మేలే జరుగుతుంది కదా."

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL